నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 22-3-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 191 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కశ్మీర్ ఫైల్స్‌పై కేసీఆర్ ఫైర్.. దేశ విభజన సరికాదు

హైదరాబాద్, మార్చి 21: ఇటీవల విడుదలైన కశ్మీర్ ఫైల్స్ సినిమాపై సీఎం కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై యువత ఆలోచించాలని కేసీఆర్ సూచించారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ముగిసిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు.

నిన్న, ఈరోజు చూస్తున్నాం.. సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తున్నారు. అవాంఛనీయమైన, అనారోగ్యకరమైన ఏ రకంగా కూడా ఆహ్వానించతగనటువంటి.. కశ్మీర్ ఫైల్స్ అనే సినిమాను తీసుకొచ్చారు. ఏదైనా ప్రొగెషివ్ గవర్నమెంట్ ఉంటే ఇరిగేషన్, ఇండస్ట్రియల్, ఎకనామిక్ ఫైల్స్ తీసుకురావాలి. కశ్మీర్ ఫైల్స్ తో వచ్చేది లేదు. పోయేది లేదు. దీనిపై కశ్మీర్ పండిట్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆ వీడియోలు తన దగ్గర ఉన్నాయి. ఈ రకమైనటువంటి దేశ విభజన, ప్రజల విభజన సరికాదు. తెలంగాణ సమాజానికి అసలు జీర్ణం కాదని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం దశాబ్దాల తరబడి ఉధృతంగా చేశాం. సకల జనుల సమ్మె అనే పిలుపునిచ్చాం. కానీ హిందువుల సమ్మె, క్రైస్తవుల సమ్మె, ముస్లింల సమ్మె అని పిలుపు ఇవ్వలేదని కేసీఆర్ గుర్తు చేశారు.

వనాలతోనే మానవాళి క్షేమం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 21: అడవుల రక్షణ, పరిరక్షణ, విస్తరణ, మొక్కలు నాటడం, చెట్ల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ, జీవివైవిధ్యాన్ని కాపాడటం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అటవీ,పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మనాలతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్నారు. సోమవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధన్యతనిస్తున్నామని తెలిపారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా తెలంగాణలో 7.70 శాతం పచ్చదనం పెరిగిందని వెల్లడించారు.మానవుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

పట్టణీకరణ, వ్యవసాయం, ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహ వినియోగం వంటి కారణాలతో అడవులు అంతరించి పోతున్నాయని, ఇది ఇలాగే కొనసాగితే జీవుల మనుగడకే ప్రమాదం అని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యత సాధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీల ఏర్పాటు, పల్లె, ప్రకృతి వనాల ద్వారా పచ్చదనం పెంచడం, రిజర్వ్ ఫారెస్ట్ బ్లాకుల్లో అర్బన్ లంగ్ స్పేస్ కోసం అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి, వన్యప్రాణుల అభయారణ్యాల్లో ఎకోసిస్టాన్ని పెంపొందించడం ద్వారా అడవులు జీవ వైవిధ్యాన్ని కాపాడటం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పర్యావరణాన్ని కాపాడటానికి, అటవీ ఆధార పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి, అడవులను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తుందన్నారు. అడవుల పరిరక్షణలో అటవీ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు.

మార్చి 23 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హైదరాబాద్, మార్చి 21: రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 23 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రాక్టికల్ పరీక్షల విషయంలో ఏవైనా సందేహాలుంటే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించొచ్చని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉండనుంది. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ ? 040-24600110.

తెలంగాణ వ్యాప్తంగా మే 6వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఫస్టియర్ పరీక్షలు 6 నుంచి మే 23వ తేదీ వరకు, సెకండియర్ పరీక్షలు 7 నుంచి 24 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

బోటును ముంచేసిన పెద్ద నౌక- పదుల సంఖ్యలో మృతి, పలువురు గల్లంతు

ఢాకా, మార్చి 21:: వందలాది మంది ప్రయాణిస్తున్న బోటును ఒక పెద్ద నౌక ఢీకొట్టి ముంచేసింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో మరణించగా పెద్ద సంఖ్యలో గల్లంతయ్యారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సమీపంలోని శీతలక్ష్య నదిలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. కార్గో షిప్ ఎంవీ రూపోషి-9, ఫెర్రీ బోటు ఎంవీ అఫ్సరుద్దీన్‌ను సమీపించి తొక్కేసింది. దీంతో అంతా చూస్తుండగా వందలాది ప్రయాణికులున్న ఆ బోటు మునిగిపోయింది. అందులోని కొందరు నదిలో దూకేశారు. సుమారు పది మందికిపైగా మరణించగా, పలువురు గల్లంతయ్యారు.

కాగా, ఐదు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బంగ్లాదేశ్ పోలీసులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు, ఒక చిన్నారి ఉన్నట్లు చెప్పారు. మరో 22 మంది ఈదుకుని క్షేమంగా నది ఒడ్డుకు చేరినట్లు వివరించారు. ప్రమాద సమయంలో ఆ బోటులో 60 మందికిపైగా ప్రయాణించినట్లు అధికారులు వెల్లడించారు.

మరోవైపు మరో బోటులో ప్రయాణిస్తున్న కొందరు తమ మొబైల్ ఫోన్‌లో దీనిని రికార్డు చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియోను చూసి నెటిజన్లు షాక్ అయ్యారు. పెద్ద ఓడ కింద నలిగిపోయిన బోటులోని ప్రయాణికుల దయనీయ స్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాల సమయంలో ఎలా తప్పించుకోవచ్చో అన్నది కొందరు వివరించారు.

తెలంగాణ ఉద్యమ తరహాలో రైతు ఉద్యమం : సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 21: తెలంగాణ ఉద్యమం తరహాలో రైతు ఉద్యమం చేయాలని, రైతులను కాపాడుకునేందుకు బీజేపీపై తీవ్ర స్థాయిలో పోరాడాలని టీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. పంజాబ్ తరహాలో తెలంగాణ నుంచి కూడా కేంద్రం రెండు పంటలు కొనేలా ఉద్యమిద్దామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో జరుగుతున్న టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పలు కీలక విషయాలపై కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు రాజ్యాంగ రక్షణ అవసరం అని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమం కంటే తీవ్రంగా ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తుందని నిప్పులు చెరిగారు.

మోదీ ప్రభుత్వం విఫలం..

మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేసీఆర్ మండిపడ్డారు. విభజన చట్టం హామీలను అమలు చేయడంలో మోదీ సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. రైతు వేసే ప్రతి గింజకు కేంద్రం గిట్టుబాటు ధర కల్పించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. కేంద్రం ఏ వర్గాన్ని సంతృప్తి పరచటం లేదని కేసీఆర్ ధ్వజమెత్తారు. 24, 25 తేదీల్లో రైతులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలన్నారు. 28వ తేదీన యాదాద్రికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని సూచించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా షబ్ కమిటీ చర్యలు తీసుకోవాలని కేసీఆర్ సూచించారు.

సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్, రైతు బంధు సమితుల జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు కూడా హాజరయ్యారు.

దేశానికి కావాల్సింది కశ్మీర్ ఫైల్స్ కాదు.. డెవలప్‌మెంట్ ఫైల్స్ : సీఎం కేసీఆర్

ఇటీవల విడుదలైన కశ్మీర్ ఫైల్స్ సినిమాపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ ఈ అంశాన్ని లేవనెత్తారు. దేశానికి కావాల్సింది కష్మీర్ ఫైల్స్ కాదు.. డెవలప్ మెంట్ ఫైల్స్ కావాలన్నారు. దేశం లో సమస్యలను పక్కదారి పట్టించడానికే ఈ సినిమాను విడుదల చేశారని మండిప డ్డారు. కేంద్రం కశ్మీర్ ఫైల్ సినిమాను వదిలిపెట్టి, ప్రజా సమస్యలను పరిష్కరించ దంలో చొరవ చూపాలన్నారు. కశ్మీర్‌లో హిందూ పండిట్‌లను చంపినప్పుడు బీజేపీ అధికారంలో లేదా? అని కేసీఆర్ ప్రశ్నిం చారు. రైతుల సమస్యలను పక్కదోవ పట్టించడానికే కశ్మీర్ ఫైల్ సినిమాను ముందుకు తెచ్చారని ధ్వజమెత్తారు. కేంద్రం అసలు విషయాలను పక్కనపెట్టి కశ్మీర్ ఫైల్స్ ని ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే దుర్మార్గం జరుగుతోందని కేసీఆర్ మండిపడ్డారు.సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్, రైతు బంధు సమితుల జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు. పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు కూడా హాజరయ్యారు.

ధాన్యం సేకరించే వరకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం : సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 21: ధాన్యం సేకరించే వరకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. సోమవారం టీఆర్ఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం సేకరణ విషయంపై కేంద్రంతో చర్చించేందుకు రేపు మంత్రుల బృందం, ఎంపిల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆహారశాఖ మంత్రిని కలిసి, మెమోరాండం అందజేస్తారన్నారు. వాళ్లు సమ్మతిస్తే సంతోషం.. సమ్మతించని పక్షంలో ఎంతని పోరాటానికైనా సిద్ధం కావాలని సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు. 'ఈ పోరాటం ఆషామాషీగా ఉండదు. మాటలు, పేపర్ స్టేట్‌మెంట్లుగా ఉండదు.. యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉంటది. చాలా పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యయుతంగా టీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు వెన్నతో పెట్టిన విద్య.తెలంగాణ ఉద్యమ స్థాయి ఎంత ఉధృతంగా ఉండెనో.. అంత ఉధృతంగా పోరాటం చేస్తాం. ఖచ్చితంగా కేంద్రం అల్టిమేట్‌గా తీసుకునే వరకు విశ్రమించే ప్రశ్న ఉత్పన్నం కాదు. ఇందులో భాగంగా మం త్రులు, ఎంపీలు రేపు విజ్ఞప్తి చేయబో తున్నరో.. అదే పద్ధతిలో తెలంగాణలోని యావత్ గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జడ్పీలు, మున్సిపల్, ఇతర సంస్థలు, మార్కెట్ కమిటీల్లో తీర్మానం చేసి ప్రధానికి పంపిస్తాం. అప్పటికే తీసుకుంటారని భావిస్తున్నాం. అలా కానీ పక్షంలో వందకు వందశాతం ఉద్యమిస్తాం. ఎంత వరకైనా పోరాడుతాం. గతంలో పంజాబ్ రైతులను ఏడిపించిన అనేక కేంద్ర ప్రభుత్వాలు.. చాలా పోరాటాల తర్వాత వంద శాతం ప్రొక్యూర్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. ఇక్కడ సమాంతరంగా పంజాబ్ మాదిరిగా వందశాతం ప్రొక్యూర్‌మెంట్ ఆర్డర్ వచ్చే వరకు పోరాటం చేస్తాం. దాన్ని వదిలే ప్రశ్నే లేదు' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

ఆహార ధాన్యాల సేకరణలో దేశమంతా ఒకే పాలసీ ఉండాలి : సీఎం కేసీఆర్

ఆహార ధాన్యాల సేకరణలో దేశమంతా ఒకే పాలసీ ఉండాలని సీఎం కేసీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ముగిసిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో సుదీర్ఘమైన చర్చ తర్వాత రాష్ట్రంలో పండిన పండబోయే యాసంగి వరి ధాన్యాన్ని పంజాబ్ తరహాలో కేంద్రం లో కొనుగోలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించాం. రేపు మంత్రుల బృందం, ఎంపీలు పార్లమెంట్‌కు వెళ్లి, ఆహార మంత్రిని తెలంగాణ రైతుల పక్షాన కలుస్తారు. కేంద్రం సూచన మేరకు, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచన మేరకు రైతులు పంటల మార్పిడి చేశారు. గతంలో 55 లక్షల ఎకరాల్లో వరి పంట ఉండే. ఈ సారి 35 లక్షల ఎకరాల్లో ఉందన్నారు. దీంట్లో 3 లక్షల ఎకరాల్లో సీడ్ కోసం వరిని ఉత్పత్తి చేశారు. మరొక రెండున్నర లక్షల ఎకరాల్లో తినడానికి వాడుకుంటారు. 30 లక్షల ఎకరాల్లో పండించిన వరి అమ్మాల్సి ఉంటుంది. పంట మార్పిడి కింద వరి ఉత్పత్తిని తగ్గించగలిగామని కేసీఆర్ తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆహార రంగంలో అన్ని దేశాలు కూడా స్వాలంబన ఉండాలని కోరుకుంటాయి. భారతదేశంలో కూడా ఫుడ్ సెక్టార్ ముఖ్యమైంది కాబట్టి.. ప్రపంచ జనాభాలో భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో దేశంలో ఆహార కొరత రాకుండా ఉండేందుకు ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ తెచ్చారు. ఈ క్రమంలో కేంద్రం ధాన్యం సేకరించి, నిల్వ చేయాలి. కొన్ని సందర్భాల్లో ఒక వేళ ఎక్కువ పంట మొత్తంలో వస్తే.. కేంద్రమే భరించి సేకరించాలి. ఆ బాధ్యత నుంచి కేంద్రం తప్పించుకోకూడదు. కేంద్రాన్ని స్పష్టంగా డిమాండ్ చేస్తున్నాం. వన్ నేషన్ వన్ రేషన్ మాదిరి గానే వన్ నేషన్ వన్ ప్రొక్యూర్‌మెంట్ ఉండాలి. ఆహార ధాన్యాల సేకరణ విషయంలో దేశమంతా ఒకే పాలసీ ఉండాలి. పంజాబ్‌కు ఒక నీతి, గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతి ఉండదు. ఇది రైతుల యొక్క జీవన్మరణ సమస్య.. ఆ పంట సేకరించే విషయంలో ఇబ్బంది పెట్టొద్దు. కొన్ని రాష్ట్రాలు ఉద్యమించాయి కాబట్టి.. 100 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేశాయని కేసీఆర్ గుర్తు చేశారు.

రైతుల ముఖాల్లో వెలుగులు..

కేంద్రం సాయం లేకపోయినా, కొత్త రాష్ట్రమైనప్పటికీ ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టి, భూగర్భ జలాలు పెంచుకుని మంచి ఉత్పత్తులు సాధిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుల ముఖాల్లో వెలుగులు వచ్చాయి. ఆత్మహత్యలు తగ్గాయి. ప్రశాంత వాతావరణం ఉంది. ఈ క్రమంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా యాసంగి కాలంలో వచ్చే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కనీస మద్దతు ధర నిర్ణయించేంది బియ్యానికి కాదు.. వరి ధాన్యానికి. ఎంఎస్పీ ప్రకారమే పంజాబ్లో సేకరిస్తున్నారు. అదే పద్ధతిలో మా వడ్లను కూడా కొనాలని కేసీఆర్ డిమాండ్ చేశారు.

కీవ్ షాపింగ్ మాల్‌పై మిస్సైల్ అటాక్..

కీవ్, మార్చి 21:: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఉన్న రెట్రోవిలీ షాపింగ్ మాల్‌పై రష్యా మిస్సైల్ దాడి చేసింది. ఆ దాడిలో ఆరుగురు మృతిచెందారు. అయితే ఆ దాడికి చెందిన వీడియోను రిలీజ్ చేశారు. ఉక్రెయిన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీస్ ఆ వీడియోను రిలీజ్ చేసింది. అగ్నిమాపక సిబ్బంది ఆ మాల్‌లో మంటల్ని ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు మారియపోల్ నగరం .. రష్యా ఇచ్చిన డెడ్‌లైన్‌ను తిరస్కరించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగిపోయేది లేదని ఉక్రెయిన్ తేల్చి చెప్పింది. ఆయుధాలను వదిలేస్తే, పౌరుల తరలింపునకు సహకరించనున్నట్లు రష్యా చెప్పింది. కానీ రష్యా ప్రభుత్వాన్ని నమ్మలేమని ఉక్రెయిన్ ప్రభుత్వం వెల్లడించింది. మారియపోల్‌లో రష్యా యుద్ధ నేరాలకు పాల్పడుతున్నట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. నగరంలోని 90 శాతం బిల్డింగ్‌లో ఇప్పటికే ధ్వంసం అయ్యాయి. ఆ నగరంలో ఇంకా మూడు లక్షల మంది తలదాచుకుంటున్నారు. వాళ్లకు విద్యుత్తు, నీరు, ఆహారం అందడం లేదు.

తెలంగాణలో అన్ని వర్గాలకు సమాన గౌరవం ఉంది: హోంమంత్రి

హైదరాబాద్, మార్చి 21: తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాలు, మతాలకు సమాన గౌరవం వుందని హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు సమాన గౌరవం,ప్రాధాన్యత కల్పిస్తూ సెక్యులర్ నాయకుడిగా ఉన్నారని అన్నారు. బోధన్ లో జరిగిన సంఘటనపై రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి ,నిజామాబాద్ కమిషనర్ కే.ఆర్ నాగరాజు లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పరిస్థితి అదుపులో ఉందని, కమిషనర్ ఇతర పోలీసు అధికారులు బోధన్ లోనే ఉండి పరిస్థితులు సమీక్షిస్తున్నారని డిజిపి హోం మంత్రికి వివరించారు.

ఉద్రిక్తత లకు దారి తీసిన పరిస్థితుల పై హోం మంత్రి ఆరాతీశారు. ఘర్షణ వాతావరణాన్ని అదుపు చేశామని అని డీజీపి హోం మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాలకు, అన్ని మతాలకు సమానమైన గౌరవం ఉందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తతో ఉన్నారని.. ప్రజలు పోలీసులకు సహకరించాలని... హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

ఆస్ట్రేలియా అప్పగించిన కళాఖండాలను తనిఖీ చేసిన మోదీ

న్యూఢిల్లీ, మార్చి 21:ఇండియాలో చోరీకి గురై అక్రమంగా తమ దేశంలోకి వచ్చిన 29 కళాఖండాలను ఆస్ట్రేలియా తిరిగి భారత్‌కు అప్పగించింది. ఆ కళాఖండాలను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారంనాడు స్వయంగా పరిశీలించారు. ఈ కళాఖండాల్లో శిల్పాలు, ఫోటోలు, పెయింటింగ్‌లు వంటివి ఉన్నాయి. వీటిలో కొన్ని 12 వ శతాబ్దానికి చెందినవి కూడా ఉన్నాయి. చోరీ, లేదా అక్రమ రవాణా మార్గంలో ఇవి ఆస్ట్రేలియాకు చేరినట్టు గుర్తించారు. ఇండియాకు వీటిని తిరిగి అప్పగించడం ఒక చారిత్రకమైన చర్యగా అధికార వర్గాలు తెలిపాయి.

ఇండియాకు తిరిగి చేరుకున్న కళాఖండాల్లో శివుడు, శక్తి, విష్ణువు, వారి అవతారాలు, జైన్ సంప్రదాయం, చిత్తరువులు, అలంకరణ వస్తువులు సైతం ఉన్నాయి. శాండ్‌స్టోన్, కంచు, ఇత్తడి, పేపర్ వంటి మెటీరియల్‌తో రూపొందించిన కళాఖండాలివి. ఇవన్నీ రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్‌లోని కళలు, సంస్కృతిని ప్రతిబింబిస్తుండటం విశేషం. వీటి విలువ 22 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్‌లు సోమవారంనాడు వర్చువల్ సమావేశం జరిపారు.

కూలిన చైనా విమానం, భారీగా ఎగసిన మంటలు - అందులో 133 మంది ప్రయాణికులు

బీజింగ్, మార్చి 21:: చైనాకు చెందిన ఒక విమానం కూలింది. అందులో 133 మంది ప్రయాణిస్తున్నారు. చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 విమానం వుజౌ నగరానికి సమీపంలోని గ్రామీణ ప్రాంతంలోని కొండల్లో కూలిపోయింది. దీంతో భారీగా అగ్నికీలలు, దట్టంగా పొగలు ఎగసిపడినట్లు చైనా అధికార మీడియా సీసీటీవీ తెలిపింది. ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన అధికారులు వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొంది. చైనా విమానం కూలిన ఘటనలో ఎంత మంది మరణించి ఉంటారన్నది తెలియరాలేదు. అయితే విమానం కూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. దీంతో ఆ విమానంలోని ప్రయాణికులు, సిబ్బందికి చెందిన బంధువులు, ఆప్తులు ఆందోళన చెందుతున్నారు.

కాగా, స్థానిక కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.11 గంటలకు కున్మింగ్ నుండి గ్వాంగ్‌జౌకి చైనా విమానం బయలుదేరింది. సాయంత్రం 3.05 గంటలకు గమ్యస్థానం చేరాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం 2.22 గంటలకు రాడార్ నుంచి విమానం మాయమైనట్లు ఫ్లైట్ డేటా ద్వారా తెలిసింది. ఆ సమయంలో విమానం 3225 అడుగుల ఎత్తులో ఉండి 376 నాట్ల వేగంతో ప్రయాణించినట్లు ఫ్లైట్ డేటా ప్రకారం తెలుస్తున్నది.

మరోవైపు 2010లో చైనాలో కూలిన విమాన ప్రమాదంలో అందులోని 96 మందిలో 44 మంది మరణించారు. హెనాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం యిచున్ విమానాశ్రయానికి చేరుకుంటుండగా ఈ ఘటన జరిగింది.

అర్బన్ ఫారెస్టు పార్కులు అద్భుతం : హైకోర్టు చీఫ్ జస్టిస్

హైదరాబాద్, మార్చి 21: హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కులో ప్రపంచ అటవీ దినోత్సవ ఉత్సవాలను నిర్వహించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ పి నవీన్ రావు, రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొని మొక్కలు నాటారు. పార్క్ ఖాళీ స్థలంలో చీఫ్ జస్టిస్ మర్రి మొక్కను నాటగా, నవీన్ రావు నేరేడు మొక్కను, వేప మొక్కను ఎంపీ సంతోష్ కుమార్ నాటారు.

తెలంగాణకు హరితహారం ద్వారా జంగిల్ బచావో- జంగిల్ బడావో నినాదంతో చేపట్టిన కార్యక్రమాలను చీఫ్ జస్టిస్‌కు అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్ఎం డోబ్రియాల్ వివరించారు. ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ పార్కులు చాలా బాగున్నాయని చీఫ్ జస్టిస్ ప్రశంసించారు.

ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పర్యావరణ ప్రేమికులతో పాటు ప్రజలందరికీ ప్రపంచ అటవీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పులను ఎదుర్కోవడానికి విరివిగా మొక్కలు నాటడమే సరైన మార్గం అని ఆయన పేర్కొన్నారు.

రెండవసారి మణిపూర్ సీఎంగా బీరెన్ సింగ్ ప్రమాణం

ఇంఫాల్, మార్చి 21:: మణిపూర్ సీఎంగా బీరెన్ సింగ్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీరెన్ నేతృత్వంలోని బీజేపీ పూర్తిస్థాయి మెజారిటీ సాధించడంతో మరోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 60 స్థానాలున్న మణిపూర్ అసెంబ్లీలో.. బీజేపీ 32 స్థానాల్లో గెలుపొందింది. దీంతో ఆదివారం జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో ఆయననే సభానాయకుడిగా ఎంపికయ్యారు. మణిపూర్ సీఎంగా బీరెన్ సింగ్ బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది రెండవసారి. సీఎం బీరెన్ సింగ్‌తో పాటు మరో అయిదుగురు ఎమ్మెల్యేలు ఇవాళ మంత్రులుగా ప్రమాణం చేశారు. బీరెన్ క్యాబినెట్‌లో నెమ్‌చా కిప్‌జెన్, వై కేమ్‌చాంద్ సింగ్, బిశ్వజిత్ సింగ్, అవాంగ్‌బో నెవ్‌మాయి, గోవిందదాస్ కొంతుజంలు మంత్రులుగా చేరారు.

హెయ్యాంగ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పంగీజం శరత్‌చంద్ర సింగ్‌పై 18 వేల ఓట్లతో బీరెన్ సింగ్ ఘన విజయం సాధించారు. దీంతో ఆయన ఎమ్మెల్యేగా ఐదోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టనున్నారు. 2016 అక్టోబర్‌లో కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి ఒక్రమ్ ఇబోబి సింగ్‌పై తిరుగుబాటు చేసిన బీరెన్ సింగ్.. ఆ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

రాష్ట్ర సీఈవోగా వికాస్ రాజ్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 21:రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)గా 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి వికాస్‌రాజ్ బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని బుద్ధ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరై.. వికాస్ రాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వికాస్‌రాజ్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శి ప్రమోద్‌కుమార్ శర్మ గత బుధవారం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. సీఈవోగా ఉన్న శశాంక్‌గోయల్ కేంద్ర సర్వీసుల్లోకి డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉన్నది. ఇంచార్జి సీఈవోగా అడిషనల్ సీఈవో బుద్ధప్రకాశ్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేథప్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిస్థాయి సీఈవోగా వికాస్‌రాజ్‌ను నియమించింది. ప్రస్తుతం వికాస్‌రాజ్ జీఏడీ ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ ఆనయుమ టి.వి. లందున
ఆవదగు చిరునవ్వులూడ దర్శన మొసగన్
"కనకాల సుమ"కు దేవుడు
ధనకన కాదుల నొసంగి ధన్యను జేయున్



–రాధశ్రీ

(మార్చి 22 టీవీ యాంకర్ కనకాల సుమ జననం...)

సెల్: 9494481210

ప్రాణికోటి మనుగడకు నీరే ఆధారం..!

(22 మార్చి 'ప్రపంచ నీటి దినోత్సవం' సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా విస్తరించబడిన వృక్ష జంతుజాల ఉనికికి మూలాధారం సజల అమృత ధారలే. రసాయనశాస్త్ర వివరణ ప్రకారం రెండు హైడ్రోజన్ పరమాణువులతో ఒక ఆక్సీజన్ పరమాణువు కలిసి ఏర్పడే త్రిపరమాణుక నీటి అణువు భౌతికంగా ఆవిరి, ద్రవం, మంచు రూపంలో అందుబాటులో ఉంటుంది. భూగోళంపై అందుబాటులో ఉన్న నీటిలో 2 శాతం మాత్రమే మానవ ఉపయోగానికి వీలుగా, 98 శాతం సముద్ర లవణజలంగా అందుబాటులో ఉన్నది. నీరు ప్రాణాధారమే కాదు సర్వవ్యాప్తం కూడా. భూగోళంపై అందుబాటులో ఉన్న సహజ నీటి వనరుల్లో సముద్రాలు, నదులు, ఉపనదులు, ఆనకట్టలు, సరస్సులు, చెరువులు, కుంటలు, బావులు లాంటివి అనేకం వస్తాయి. మానవాళి కనీస అవసరాలలో నీటికి తగు ప్రాధాన్యత ఉంది. తాగు, సాగు నీటికి ప్రపంచ దేశాలు నిరంతరం తపన పడటం జరుగుతోంది. నీటి కొరత ప్రపంచ ముఖ్య సమస్యగా మానవజాతిని పట్టి పీడిస్తున్నది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో '2030 వరకు అందరికీ నీరు, పారిశుధ్య లభ్యత' అనే అంశం తీసుకోబడింది. నీటి ప్రాముఖ్యత ప్రచారం, వృధాను అరికట్టడం, వర్షపు నీటి పరిరక్షణ, నీటి నిలువ ప్రదేశాల రక్షణ లాంటి అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో భాగంగా 1993 నుంచి ప్రతి ఏటా 22 మార్చి రోజున 'ప్రపంచ నీటి దినోత్సవం' నిర్వహిస్తారు. ఈ ఏడాది ప్రపంచ నీటి దినం-2021 నినాదంగా 'నీటికి విలువనిద్దాం (వాల్యూయింగ్ వాటర్)' అనే అంశాన్ని తీసుకున్నారు. బావి ఎండినపుడు, నల్లా రానపుడు, బోర్‌లో నీరు లేక బావురుమన్నపుడు నీటి విలువ లోతు తెలుస్తుంది.

గొంతు ఎండుతున్న భారతం:

ఇండియాలో నీటి కొరత అతి పెద్ద సమస్యగా నిలిచింది. భారతదేశంలోని ఫ్రెష్ వాటర్‌లో 80 శాతం వ్యవసాయ రంగానికే వినియోగపడుతున్నది. భారత వ్యవసాయంలో 50 శాతం నీటి ఆధార వరి, గోధుమలు, చెరకు, పత్తి లాంటి పంటలు మాత్రమే ఉన్నాయి. ఇండియా వ్యవసాయ రంగాన్ని ఇతర దేశాలతో పోల్చితే రెండింతల నీటిని వినియోగిస్తున్నది. భారత్‌లో 63 శాతం బావుల ద్వారా, 26 శాతం ఆనకట్టల క్రింద వ్యవసాయం నడుస్తున్నది. భారత్‌లో దాదాపు 30 మిలియన్ల బోర్ బావులు ఉన్నాయి. ప్రపంచ భూగర్భ జలాల్లో 25 శాతం ఇండియా వినియోగిస్తున్నది. మన దేశంలో దాదాపు 60 శాతం జిల్లాలు తీవ్ర నీటి కొరతను అనుభవిస్తున్నాయి. తాగు నీటికి కిమీల దూరం బిందెలు మోస్తున్న మహిళల్ని చూస్తున్నాం. ప్రపంచ 122 దేశాల 'నీటి నాణ్యత సూచిక జాబితా'లో భారత్ 120వ స్థానంలో నిలిచింది. నీటి కొరత కారణంగా మన జీడీపీలో 6 శాతం క్షీణత కనిపిస్తున్నది. దేశంలో సగం జనాభాకు సురక్షిత నీరు లభించడం లేదు. ఏడాదికి 2 లక్షల ప్రజలు నీటి కొరతతో మరణిస్తున్నారు. ఇండియాలో నేటికీ 82 శాతం కుటుంబాలకు సురక్షిత నల్లా నీరు దొరకడం లేదనే వాస్తవం మింగుడు పడడం లేదు.

భవిష్యత్తులో జల యుద్ధాలు:

గృహ అవసరాలు, ఆహారం, ఆరోగ్యం, విద్య, ఆర్థిక వృద్ధి, సంస్కృతి, పర్యావరణం లాంటివి నీటి లభ్యతకు సంబంధాన్ని కలిగి ఉంటాయి. బహుముఖీన ప్రయోజనం కలిగిన నీటి కొరత కారణంగా ప్రపంచ దేశాల మధ్య జల యుద్ధాలు జరిగే అవకాశాలు లేక పోలేదు. సహజంగా వర్షం రూపంలో ఉచితంగా నీరు లభించడం వల్ల దాని విలువ మనిషికి తెలియడం లేదు. నీటిని పొదుపుగా వాడటం, వర్ష నీటిని నిలువ ఉంచుకోవడం, నల్లా లీకేజీని అరికట్టడం, పర్యావరణ పరిరక్షణతో వర్షాలు పడటం, వాటర్‌షెడ్స్ నిర్మించడం, చెరువులు నింపడం, ఆనకట్టలు కట్టడం, బొట్టు బొట్టు ఒడిసి పట్టడం, భూగర్భ జలాలను కాపాడుకోవడం లాంటి చర్యలు తీసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా 2.2 బిలియన్ల ప్రజలు సురక్షిత నీటికి దూరంగా ఉన్నారు. జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, వ్యవసాయరంగం వల్ల నీటి సమస్య ఏర్పడుతున్నది. కరోనా కల్లోలంలో చేతులను సబ్బుతో కడుక్కోవడం ప్రధానమైన అలవాటుగా మారింది. 2018-28 దశాబ్దాన్ని ఐరాస 'సుస్థిరాభివృద్ధికి నీటి చర్యల అంతర్జాతీయ దశాబ్దం'గా తీసుకోబడింది. పేదరిక నిర్మూలన, ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణల సాధనకు నీరు సహకరిస్తుంది. ప్రతి ముగ్గురిలో ఒకరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నారు. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా 5.7 బిలియన్ల ప్రజలు సాలీన కొన్ని మాసలైనా నీటి కొరతను ఎదుర్కోబోతున్నారు. నీటి లభ్యతతో ఏటా 3.6 లక్షల శిశువుల ప్రాణాలు కాపాడబడుతున్నాయి. 2040 నాటికి ప్రపంచ శక్తి అవసరాలు 25 శాతం, నీటి గిరాకీ 50 శాతం పెరిగి నీటి కోసం యుద్ధాలు జరగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నీరే ప్రాణాధారం:

నీటి ఉపయోగాలలో తాగు, సాగు, వంట, స్నానం, జలవిద్యుత్ కేంద్రాలు, పర్యాటకం, వినోదం, రవాణ, పరిశ్రమలు, వృక్ష సంపద, శరీర శుద్ధి, చేపలు, జల సంపద, కిరణజన్య సంయోగక్రియ, పళ్ళు తోమడం, బట్టలు/పాత్రల శుద్ధి, నిర్మాణ రంగం, శరీర క్రియలు, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, లాలాజలం ఊరడం, కీళ్ళు/కణజాలాలు/వెన్నెముక సంరక్షణలు, మలబద్ధక నివారణ, శారీరక క్రియాశీలత పెరగడం, బరువు నియంత్రణ, రోగాలను అడ్డుకోవడం, శక్తి జననం, రక్త ప్రసరణ, పోషకాల శోషణం, మానసిక స్థితిలో వృద్ధి, ప్రాణికోటి మనుగడ, చర్మ సౌందర్యం, మబ్బులు, డీహైడ్రేషన్‌ను నివారించడం, జీర్ణక్రియకు సహకారం లాంటి పలు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకప్పుడు ఉచితంగా లభించే తాగు నీటికి నేడు ధనం వెచ్చించడం విచారకరం.

జలమే జీవనాధారమని, నీరే పర్యావరణ పరిరక్షణకు ఔషధమని, సుజల స్రవంతియే సౌభాగ్య ప్రదాత అని నమ్ముదాం, వెలకట్టలేని నీరే మానవాళికి అపూర్వ ప్రసాదమని భావిద్దాం. బొట్టు బొట్టు నీటిని భద్రంగా ఒడిసి పట్టి దాచుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

హైదరాబాద్ టు పాకిస్థాన్.. అక్రమంగా ట్రమడాల్ ఎగుమతి

హైదరాబాద్, మార్చి 19:తీవ్రమైన నొప్పి నివారణకు ఉపయోగించే ట్రామడాల్ డ్రగ్ ను ఎలాంటి అనుమతులు లేకుండా ఉత్పత్తి చేయడమే కాకుండా అక్రమంగా పాకిస్తాన్ కు విక్రయించి సొమ్ముచేసుకుంటున్న ల్యూసెంట్ డ్రగ్ కంపెనీపై ఎన్సీబీ దాడులు నిర్వహించి కంపెనీ డైరెక్టర్ తో పాటు నలుగురు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారణ నిమిత్తం బెంగుళూరులోని ఎన్ సీబీ కార్యాలయనికి తరలించారు.. ట్రామడాల్ వినియోగం అక్రమమని తెలుస్తుండగా ప్రత్యేక పర్యవేక్షణ లేకుండా వినియోగించరాదని, కొన్ని సార్లు ప్రత్యేక పర్యవేక్షణలో ట్రామిడాల్ ను వినియోగిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు..కాగా సదరు ల్యూసెంట్ కంపెనీకి ట్రమడాల్ డ్రగ్ అనుమతి ఉందా లేదా అనుమతి ఉంటే అంత చిన్న కంపెనీ ఒకే సంవత్సరంలో అంటే 2021 లొనే 25 వేల కిలోల ట్రామిడాల్ ను ఎలా పాకిస్తాన్ కు ఉత్పత్తి చేసింది, అంత బారి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యం లేని ల్యూసెంట్ ఇతర కంపెనీలు సహకారం అందించాయ, పాకిస్తాన్ కు అక్రమంగా ఎలా ఎగుమతి చేశారనే కోణంలో ఎన్సిబి అధికారులు తమదైన శైలిలో విచారించేందుకే డైరెక్టర్ తో పాటు నలుగురు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సెంచరీ కొట్టిన నిమ్మ మార్కెట్ - కిలో రూ.100

అమరావతి, మార్చి 21:నేటి మార్కెట్ లో నిమ్మ రేటు రూ. 100 పలికింది.. పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు మార్కెట్ లో అత్యధిక రేటు దక్కింది.

జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు లో అయితే ఇదే నిమ్మ మార్కెట్ కిలో రూ. 95 కు చేరింది.ఈ ఏడాదికి నిమ్మ రైతుకు ఇదే గరిష్టం..జనవరి లో రూ. 20 నుండి ఆరంభం అయిన నిమ్మ ధర క్రమంగా నేటి మార్కెట్ ఇంకా పై పై చూపు లో కొనసాగుతోంది..కాపు లేక నిమ్మ ధర డిమాండ్ పెరిగింది.. మున్ముందు నిమ్మ ధర మరింత ప్రియం కానుంది..ఈ జిల్లా నుండి ప్రస్తుతం కలకత్తా కు ఎక్కువగా ఎగుమతి అవుతోంది..ప్రస్తుతం నిమ్మ మార్కెట్ తో నిమ్మ రైతు సంతోషంతో ఉన్నాడు.

తెలంగాణ భారత్‌లో ఉందా? పాకిస్థాన్‌లో ఉందా?

హైదరాబాద్, మార్చి 21:బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భారతదేశంలో ఉందా ? లేక పాకిస్థాన్ లో ఉందా? అని ప్రశ్నించారు. ఛత్రపతి శివాజీకి జై అంటే నేరమా? నిలదీశారు.

హైదరాబాద్ నుంచి ఇస్లామాబాద్ వరకు ఎంఐఎం టెర్రర్ కారిడార్ ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు. ఎంఐఎంకు ప్రభుత్వం, పోలీసులు సహకరిస్తున్నారని మండిపడ్డారు. హిందువుల గురించి మాట్లాడితే మతపిచ్చా? అని మురళీదర్ రావు ప్రశ్నించారు. బాధ్యత రహితంగా మాట్లాడితే ఖబడ్దార్ కేసీఆర్ అని హెచ్చరించారు. మతోన్మాదానికి, ఉగ్రవాద కార్యకలాపాలకు కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఒవైసీ, కేసీఆర్ రాజకీయాలు నడవవు అని పేర్కొన్నారు.

వినియోగదారులు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుపోవడం ద్వారా ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలను ఉధృతం చేయనున్న బిఐఎస్

న్యూఢిల్లీ, మార్చి 21: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రతీకాత్మక వారోత్సవాల సందర్భంగా బిఐఎస్ ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలలో వినియోగదారుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుపోయేందుకు బిఐఎస్ కేంద్ర కార్యాలయంలో వెబినార్‌ను నిర్వహించడం జరిగింది.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో వినియోగదారుల ఉద్యమ ఉద్భవం, నాణ్యత వ్యవస్థను మెరుగుపరచడంలో అది పోషించిన కీలక పాత్రను బిఐఎస్ డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రమోద్ కుమార్ తివారీ వెబినార్ ను ప్రారంభిస్తూ వివరించారు. ప్రమాణాల అభివృద్ధిలో వినియోగదారుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పోషించిన పాత్రను, ప్రభుత్వానికి, నియంత్రణదారులు, సామాన్య వినియోగదారుల మధ్య ఈ సంస్థలు ఎలా వారధిలా వ్యవహరిస్తాయి అనే విషయాలను వివరించారు. దీనితోపాటుగా, బిఐఎస్ ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలను తీవ్రతరం చేయవలసిన అవసరాన్ని కూడా శ్రీ తివారీ వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన 200కిపైగా ప్రతినిధులు వెబినార్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా థింక్, నడ్జ్ ఢ మూవ్ విభాగం అధిపతి శ్రీ చందన్ బాల్ మాట్లాడుతూ, బిఐఎస్ చేపట్టిన ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలు, స్వచ్ఛందన, వినియోగదారుల సంస్థలు ఆ కార్యకలాపాలలో ఎక్కడెక్కడ నిమగ్నం కావచ్చో ప్రతినిధులకు వివరించారు. ప్రమాణాల క్లబ్బుల నిర్వహణ, చైతన్యపరిచే కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు సహా ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలలో వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుపోయేందుకు బిఐఎస్ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలను ఆయన వివరించారు.

ఇటీవలే బిఐఎస్ అభివృద్ధి చేసిన కన్స్యూమర్ ఎంగేజ్‌మెంట్ పోర్టల్‌ను పాల్గొన్నవారికి ప్రదర్శించారు. తమ ప్రత్యేక ఎన్జీవో దర్పన్ కార్డును, పాన్ కార్డు నెంబరును వినియోగించి బిఐఎస్‌తో వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థలు సులువుగా నమోదు చేసుకోవడం అనే అంశాన్ని ఇందులో పొందుపరిచారు. బిఐఎస్ జారీ చేసిన మార్గర్శకాలను, అందించే కార్యక్రమాలతో సహకరించేందుకు వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థలు అందించే ప్రతిపాదనలను చూసేందుకు సంబంధించిన ప్రక్రియలను కూడా ప్రదర్శించారు.

వెబినార్‌లో వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చురుకుగా పాల్గొని, బిఐఎస్ చొరవను ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా ప్రమాణాలు, నాణ్యత సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు బిఐఎస్‌తో సహకరించేందుకు ఎదురుచూస్తున్నామని వారు వెల్లడించారు.

జనవరి 2022లో ఈపీఎఫ్ఓలో కొత్తగా 15. 29 లక్షల సభ్యుల చేరిక

న్యూఢిల్లీ, మార్చి 21:ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) లో 2022 జనవరి నెలలో కొత్తగా 15.29 లక్షల మంది సభ్యులు చేరారు. ఈ రోజు ఈపీఎఫ్ఓ తాత్కాలిక పేరోల్ డేటా విడుదల అయ్యింది. 2021 డిసెంబర్ నెలతో పోలిస్తే 2022 జనవరి లో ఈపీఎఫ్ఓ లో చేరిన నికర సభ్యుల సంఖ్య 2.69 లక్షలకు పైబడి ఎక్కువగా ఉంది.

జనవరి నెలలో కొత్తగా చేరిన 15.29 లక్షల మంది సభ్యులలో 8.64 లక్షల మంది తొలిసారిగా సామాజిక భద్రత అందిస్తున్న ఈపీఎఫ్, ఎంపీ చట్టం 1952 పరిధిలో ఈపీఎఫ్ఓ సభ్యత్వం తీసుకున్నారు. ఈపీఎఫ్ఓ నుంచి దాదాపు 6.65 లక్షల మంది నికర సభ్యులు నిష్క్రమించి, తిరిగి ఇపిఎఫ్ఓలో చేరారు. చందాదారులు తుది పరిష్కారం కోసం కాకుండా తమ సభ్యత్వాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. ఈపీఎఫ్ఓ సభ్యత్వాన్ని వదులుకుంటున్న వారి సంఖ్య 2021 జూలై నెల నుంచి తగ్గుతూ వస్తోంది.

వయస్సువారిగా సభ్యుల వివరాలను పరిశీలిస్తే జనవరి నెలలో ఈపిఎఫ్ఓలో 18-25 మధ్య వయసులో ఉన్నవారు అత్యధికంగా సభ్యులుగా చేరారు. 18-25 మధ్య వయస్సు ఉన్న 6.90 లక్షల మంది ఈపీఎఫ్ఓ లో సభ్యత్వం తీసుకున్నారు. వీరి తర్వాత వారు ఈపీఎఫ్ఓ లో సభ్యత్వం తీసుకున్నారు.

ఈపీఎఫ్ఓ లో 29-35 మధ్య వయస్సు ఉన్న 3.23 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు.

ఈ వివరాలను పరిశీలిస్తే సంఘటిత రంగంలో తొలిసారిగా ఉపాధి పొందిన వారి సంఖ్య ఎక్కువగా ఉందని తెలుస్తోంది. వ్యక్తిగత ఆదాయ అవకాశాలు ఎక్కువగా ఉన్న రంగాల్లో చేరుతున్న వారు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేందుకు అవకాశం కలిగి ఉంటారు.

రాష్ట్రాల వారీగా గణాంకాల విశ్లేషణ ప్రకారం, మహారాష్ట్ర, హర్యానా, గుజరాత్, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలు ఉపాధి కల్పనలో ముందంజలో ఉన్నాయి.మహారాష్ట్ర, హర్యానా, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అన్ని వయసులకు చెందిన 9.33 లక్షల మంది ఈపీఎఫ్ఓ నికర చందాదారులుగా చేరారు. మొత్తం చందాదారులు సంఖ్యలో ఇది 61%గా ఉంది.

జనవరి నెల పేరోల్ డేటాను స్త్రీ పురుషుల వారీగా విశ్లేషిస్తే ఈపీఎఫ్ఓ లో 3.20 లక్షల మంది మహిళలు సభ్యులుగా చేరారు.

మొత్తం సభ్యుల సంఖ్యలో మహిళలు 21% వరకు ఉన్నారు. 2021 డిసెంబర్ నెలలో ఈపీఎఫ్ఓ లో చేరిన మహిళల సంఖ్యతో పోల్చి చూస్తే ఈపీఎఫ్ పథకం లో 57,722 మంది మహిళలు ఎక్కువగా చేరారు.

పరిశ్రమల వారీగా చూస్తే " ప్రత్యేక తరగతి" (మానవ వనరుల కల్పనా సంస్థలు, ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు, చిన్న కాంట్రాక్టర్లు) జాబితా కిందికి వచ్చే వారు జనవరి నెలలో అత్యధికంగా 39.95% వరకు సభ్యులుగా ఉన్నారు.

భవన నిర్మాణం, వ్యాపార సంస్థలు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ మెకానికల్, సాధారణ ఇంజనీరింగ్ రంగాల్లో పనిచేస్తున్న వారు కూడా ఈపీఎఫ్ఓ సభ్యులుగా ఎక్కువగా చేరుతున్నారు.

డేటా ఉత్పత్తి మరియు ఉద్యోగుల రికార్డులను నవీకరించడం నిరంతర ప్రక్రియగా సాగుతుంది. దీనితో ప్రస్తుత వివరాలు తాత్కాలిక వివరాలుగా ఉంటాయి. ప్రతినెలా వివరాలను ఆధునీకరించడం జరుగుతుంది.

ఈపీఎఫ్ఓ సెప్టెంబర్ 2017 కాలం తర్వాత నమోదైన పేరోల్ డేటాను ఏప్రిల్, 2018 నుండి విడుదల చేస్తోంది.

సంఘటిత రంగానికి చెందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్, భీమా,పెన్షన్ వంటి సామాజిక భద్రత సౌకర్యాలను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్స్ అండ్ మెసిలేనిస్ చట్టం 1952 కింద ఈపీఎఫ్ఓ అందిస్తున్నది. ఇటీవల కాలంలో ఈపీఎఫ్ఓ సామాజిక మాధ్యమాలను ఎక్కువగా వుప్పగిస్తున్నది. ట్విట్టర్, వాట్సాప్, పేస్ బుక్ ల ద్వారా సభ్యుల సమస్యల పరిష్కారానికి సంస్థ కృషి చేస్తున్నది.

గనులరంగం వృద్ధి చెందడం భారత ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధికి దోహదకారిగా మారుతుంది కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, మార్చి 21:గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశం యొక్క మైనింగ్ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని..కేంద్ర బొగ్గు, గనులు మరియు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. అంతేకాకుండా మైనింగ్ రంగంలో దేశవ్యాప్తంగా 12 మిలియన్ల మంది ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని చెప్పారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన 36వ అంతర్జాతీయ జియోలాజికల్ కాంగ్రెస్ మంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఖనిజాల అన్వేషణలో వేగం అనేక రెట్లు పెరిగిందని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు సరైన పునరుజ్జీవనాన్ని అందించిన మైనింగ్ రంగంలో ఇటీవలి కాలంలో చేపట్టిన సంస్కరణలను ప్రస్తావిస్తూ.. మెరుగైన శిఖరాలను అందుకోవడానికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోందని మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రశంసించారు.

36వ అంతర్జాతీయ జియోలాజికల్ కాంగ్రెస్ యొక్క ప్రాముఖ్యతను స్పృశిస్తూ... 58 సంవత్సరాల తర్వాత భారతదేశం ఆతిథ్యమిస్తున్న మూడు రోజుల కార్యక్రమమిదని, సుస్థిర అభివృద్ధి రంగంలో మరింత ప్రభావవంతమైన సాధనాలను రూపొందించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భూ శాస్త్రజ్ఞులకు సరైన వేదికను అందిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

బొగ్గు, గనులు మరియు రైల్వేల శాఖ సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ దాన్వే, కమ్యూనికేషన్స్ రాష్ట్ర మంత్రి దేవుసిన్ చౌహాన్ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్, పీఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్లు, అటామిక్ ఎనర్జీ, స్పేస్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇతర ప్రముఖులలో గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్. అలోక్ టోండన్, భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్. ఎం. రవిచంద్రన్, జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర సింగ్ గర్ఖాల్ తదితరులు ఉన్నారు.

"జియోసైన్సెస్: ది బేసిక్ సైన్స్ ఫర్ ఎ సస్టైనబుల్ ఫ్యూచర్" అనే ఇతివృత్తంతో 36వ ఇంటర్నేషనల్ జియోలాజికల్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నారు. ఐజీసీ అనేది గనుల మంత్రిత్వ శాఖ, ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ మరియు బంగ్లాదేశ్, నేపాల్ మరియు శ్రీలంక సైన్స్ అకాడమీల ఉమ్మడి సంస్థ. నాలుగేళ్లకోసారి నిర్వహించే ఈ కాంగ్రెస్ను జియోసైన్సెస్ ఒలింపిక్స్‌గా పిలుస్తున్నారు. ఆయా దేశాల ఐజీసీలు సైంటిఫిక్ స్పాన్సర్ అయిన ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ జియోలాజికల్ కాంగ్రెస్ (ఐయూజీఎస్) ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 5000వేల నుంచి 7000 మంది ప్రతినిధులు పాల్గొంటారు.

ఈ కార్యక్రం జియోసైన్సెస్ మరియు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలు మరియు అనుభవాలను పంచుకోవడానికి ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తోంది. ఇది మైనింగ్, ఖనిజాల అన్వేషణ మరియు నీటి నిర్వహణ, ఖనిజ వనరులు మరియు పర్యావరణంలో తాజా సాంకేతికతలపై ప్రత్యక్ష సమాచారాన్ని అందిస్తుంది. ఐజీసీ ప్రారంభ రోజున, జియో టూరిజం హాట్‌స్పాట్‌లపై స్మారక పోస్టల్ స్టాంపులు, ఫస్ట్ డే కవర్ మరియు మల్టీ కలర్ కాఫీ టేబుల్ పుస్తకాలను ఆవిష్కరించారు.

ప్రాంతీయ సంస్థలకు నాయకత్వం వహిస్తున్న భారతదేశం 2012లో బ్రిస్బేన్లో జరిగిన అంతర్జాతీయ జియోలాజికల్ కాంగ్రెస్లో.. 2020లో జరగనున్న 36వ ఐజీసీ కోసం ప్రాంతీయ భాగస్వాములతో కలిసి బిడ్ వేసింది. వాస్తవానికి 2020 మార్చి 2-8 తేదీలలో జరగాల్సిన ప్రస్తుత కాంగ్రెస్.. కోవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. 58 సంవత్సరాల క్రితం ఆసియాఖండంలోనే తొలిసారిగా 22వ ఇంటర్నేషనల్ జియోలాజికల్ కాంగ్రెస్కు భారతదేశం ఆతిథ్యం ఇచ్చింది.

బోధన్‌లో 144 సెక్షన్.. శివాజీ విగ్రహం వద్ద ప్రత్యేక పికెటింగ్

నిజామాబాద్, మార్చి 21:నిజామాబాద్ జిల్లాలోని బోధన్ పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. బోధన్ బంద్‌కు బీజేపీ పిలుపునివ్వడంతో ఆందోళనకారులను ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పట్టణ వాసులు గుమిగూడకుండ పోలీసులు చర్యలు చేపట్టారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. సభలు, సమావేశఆలపై నిషేదం విధించారు.

శివాజీ విగ్రహాన్ని నెలకొల్పిన అంబేద్కర్ చౌరాస్తాలో ప్రత్యేక పికెటింగ్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్దకు ఎవరూ రాకుండా రహదారిలో పోలీసులు అడ్డుకుని, వాహనదారులను వెనక్కి తిప్పి పంపుతున్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో వ్యాపార సముదాయాలను మూసి ఉంచారు. రాజకీయ పార్టీల నేతలు బోధన్ లోకి ప్రవేశిస్తే అరెస్ట్ చేస్తామని సీపీ స్పష్టం చేశారు. నిన్నటి ఘర్షణలో 10 మందిని అరెస్ట్ చేయగా.. నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు.

బోధన్‌లో ఆదివారం(మార్చి 20) తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓ పార్టీ రాత్రికి రాత్రే ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఘర్షణకు కారణమైంది. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం(మార్చి 19) రాత్రి ఓ పార్టీ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన ఓ వర్గం వారు.. విగ్రహాన్ని తొలగించాలంటూ అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించారు.

దీంతో మరో వర్గం వారు కూడా వందలాదిగా అక్కడికి వచ్చారు. ఈ అంశంపై ఇరువర్గాల మధ్య మొదలైన వాగ్వాదం రాళ్ల దాడికి దారి తీసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పట్టణంలో 144 సెక్షన్ విధించారు. విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ తీర్మానం ఉందని, విగ్రహాన్ని తొలగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఇరు వర్గాలు ఎదురెదురుగా టెంట్లు వేసుకుని ఆందోళనకు దిగాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏసీ పీ రామారావు ఇరువర్గాలను సముదాయించేందు కు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నినాదా లు చేస్తూ ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నాయి. ఈ క్రమంలో ఆందోళనకారులు వేసుకున్న టెంట్‌ను పోలీసులు తొలగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. సీపీ లాఠీచార్జికి ఆదేశించడంతో ప్రత్యేక బలగాలు లాఠీలు ఝుళిపించాయి. బాష్పవాయువును ప్రయోగించారు.

జూ.ఎన్టీఆర్ కారును ఆపేసిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 21:ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఫేక్ స్టిక్కర్లు వేసుకొని రోడ్లపై తిరుగుతున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. సామాన్య ప్రజలు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులకు సంబంధించిన వాహనాలను కూడా వదలడం లేదు. కార్లకు నకిలీ స్టిక్కర్లు, ఎమ్మెల్యే స్టిక్కర్లు, బ్లాక్ ఫిల్ములతో తిరుగుతున్న వారిని గుర్తించి వారికి చలానాలు విధిస్తున్నారు.

ఈ క్రమంలో టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌కు చెందిన కారుకు బ్లాక్ ఫిల్మ్ ఉండటంతో వాహనాన్ని ఆపి దాన్ని తొలగించారు. ఈ సమయంలో డ్రైవర్‌తో పాటు జూనియర్ ఎన్టీఆర్ కుమారుడు, మరొకరు ఉన్నట్లు తెలిసింది. అలాగే ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేరుతో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్, ఎంఐఎం ఎమ్మెల్యే మేరాజ్ హుస్సేన్, ఆంధ్రప్రదేశ్‌లో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేరుతో ఉన్న వాహనాలపై ఉన్న స్టిక్కర్లను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి తొలగించారు. ఈ క్రమంలోనే నంబరు ప్లేటు సరిగా లేని వాహనాలకు చలాన్లు విధించారు. 90 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పుణె, థానేకి చెందిన యునికార్న్ స్టార్టప్ గ్రూప్‌పై ఆదాయపు పన్ను శాఖ సోదాలు

న్యూఢిల్లీ, మార్చి 21:నిర్మాణ సామగ్రి టోకు మరియు రిటైల్ వ్యాపారం చేస్తున్న పుణె, థానే కి చెందిన యునికార్న్ స్టార్టప్ గ్రూప్‌పై ఆదాయపు పన్ను శాఖ ఈ నెల 9న సోదాలు నిర్వహించింది. దేశ వ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించి ఉన్న ఈ గ్రూప్ వార్షిక టర్నోవర్ రూ. 6,000 కోట్లు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో మొత్తం 23 ప్రాంగణాలలో సోదాలు చేశారు. .

ఈ సందర్భంగా హార్డ్ కాపీ డాక్యుమెంట్లు మరియు డిజిటల్ డేటా రూపంలో పెద్ద సంఖ్యలో నేరారోపణ సాక్ష్యాలు బయటపడ్డాయి వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆధారాల ప్రకారం, ఈ గ్రూప్ బోగస్ కొనుగోళ్లతో, భారీగా లెక్కలు చూపని ఖర్చులు, ఎంట్రీలతో రూ. 400 కోట్లు లావాదేవీలు చూపింది. ఈ ఆధారాలను గ్రూప్ డైరెక్టర్ల దృష్టిలో ఉంచారు. వారు ఇంకా రూ. 224 ఎక్కువ అదనపు ఆదాయాన్ని వెల్లడించారు. అధిక ప్రీమియంతో షేర్లను జారీ చేయడం ద్వారా మారిషస్ మార్గం ద్వారా గ్రూప్ భారీ విదేశీ నిధులను పొందినట్లు సోదాలలో వెల్లడైంది. సెర్చ్ ఆపరేషన్ సమయంలో, కొన్ని ముంబై మరియు థానే ఆధారిత షెల్ కంపెనీల సంక్లిష్ట హవాలా నెట్‌వర్క్ కూడా బయటపడింది. ఈ షెల్ కంపెనీలు కాగితంపై ఉన్నాయి మరియు వసతి ఎంట్రీలను అందించడం కోసం మాత్రమే సృష్టించబడ్డాయి. ఈ షెల్ ఎంటిటీలు అందించిన వసతి ఎంట్రీల మొత్తం పరిమాణం రూ. 1,500 కోట్లు కంటే ఎక్కువగా ఉందని ప్రాథమిక విశ్లేషణ వెల్లడించింది. ఇప్పటి వరకు లెక్కల్లో చూపని రూ. 1 కోటి, ఆభరణాలు రూ. 22 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.తదుపరి విచారణ జరుగుతోంది

నెచ్చెలి అంతర్జాల వనితా మాస పత్రిక
అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ &
శ్రీ శారదా సత్యన్నారాయణ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్
సంయుక్త ఆధ్వర్యంలో
నెచ్చెలి అంతర్జాల వనితా మాసపత్రిక
కథల పోటీ - 2022
ఆఖరు తేదీ : మే 10, 2022
ఇతివృత్తం: యువతులు - సమస్యలు
1st Prize రెండు మొదటి బహుమతి కథలు ఒక్కొక్కటికి రూ॥ 2,500/-
2nd Prize రెండు ద్వితీయ బహుమతి కథలు ఒక్కొక్కటికి రూ॥1,500/-
3rd Prize రెండు తృతీయ బహుమతి కథలు ఒక్కొక్కటికి రూ॥1,000/-
సాధారణ ప్రచురణకు 20కథలు స్వీకరించబడతాయి. ఎంపికచేసిన కథలు "నెచ్చెలి"లో నెలనెలా ప్రచురించబడతాయి.
నిబంధనలు:
* ఇతివృత్తం : యువతులు - సమస్యలు
* కథతోబాటు ఎక్కడా ప్రచురణ కాలేదనీ, పరిశీలనకు పంపలేదని హామీ పత్రం జతచేయాలి. హామీ పత్రం లేని కథలు స్వీకరించబడవు.
* కథలు వర్డ్ ఫైల్‌లో పది పేజీలకు మించకుండా, తప్పనిసరిగా యూనికోడ్‌లో ఉండాలి. పీడీఎఫ్ కూడా జతచేయాలి.
* ఒక్కొక్కరూ ఒక్క కథ మాత్రమే పంపాలి.
* గడువు తేదీ తర్వాత అందిన కథలు పరిశీలింపబడవు.
* బహుమతుల విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.
* పోటీ ఫలితాలు "నెచ్చెలి" 3వ జన్మదిన సంచికలో జూలై 10న వెలువడతాయి.
నిర్వాహకులు
డా॥ కె. గీత
సంస్థాపక సంపాదకులు
నెచ్చెలి అంతర్జాల వనితా మాస పత్రిక
కోసూరి ఉమాభారతి, డైరెక్టర్
అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ &
శ్రీ శారదా సత్యన్నారాయణ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్
ఈ-మెయిల్ మీద "అర్చన అకాడమీ & నెచ్చెలి కథల పోటీ - 2022కి" అని వ్రాసి
క్రింది రెండు మెయిల్స్‌కు పంపాలి.
editor@neccheli.com
rachanalu2022@gmail.com

పన్నులు కట్టకపోతే-ఆస్తులు జప్తు చేయడం తప్పేం కాదు - మంత్రి 'బొత్స'

అమరావతి, మార్చి 21:కరెంట్ బిల్లు కట్టకపోతే కరెంట్ తీసేస్తామని చెప్పడంలో తప్పేముందని మంత్రి బొత్స సత్యనారాయన ప్రశ్నించారు. ఆస్తుల జప్తు అనేది ఇప్పుడు కొత్తగా రాలేదని అన్నారు. పన్నులు కట్టకపోతే ..ఆస్తులు జప్తు చేస్తామని చెప్పడాన్ని తప్పు అంటే ఎలా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు చేసినప్పుడు ఈ విధానాన్ని ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. ఆస్తులు జప్తు చేయడం తమ ఉద్దేశం కాదని చెప్పారు. పన్నులు కట్టకపోతే స్థానిక సంస్థలు బలోపేతం కాలేవని అన్నారు. పన్నులు కట్టకపోతే అధికారులు నోటీసులు ఇవ్వాలని? ఇంటికి తాళాలు వేయడం సరికాదని చెప్పారు. ఆస్తి పన్నులు కట్టని వారిపై ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఆస్తిపన్ను కట్టకపోతే ఆస్తులు జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు చెత్త పన్ను కట్టలేదనే కారణంతో దుకాణాల ముందు చెత్త వేసిన ఘటన విమర్శల పాలయింది.

వినియోగదారులు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుపోవడం ద్వారా ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలను ఉధృతం చేయనున్న బిఐఎస్

న్యూఢిల్లీ, మార్చి 21: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రతీకాత్మక వారోత్సవాల సందర్భంగా బిఐఎస్ ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలలో వినియోగదారుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుపోయేందుకు బిఐఎస్ కేంద్ర కార్యాలయంలో వెబినార్‌ను నిర్వహించడం జరిగింది.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో వినియోగదారుల ఉద్యమ ఉద్భవం, నాణ్యత వ్యవస్థను మెరుగుపరచడంలో అది పోషించిన కీలక పాత్రను బిఐఎస్ డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రమోద్ కుమార్ తివారీ వెబినార్ ను ప్రారంభిస్తూ వివరించారు. ప్రమాణాల అభివృద్ధిలో వినియోగదారుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పోషించిన పాత్రను, ప్రభుత్వానికి, నియంత్రణదారులు, సామాన్య వినియోగదారుల మధ్య ఈ సంస్థలు ఎలా వారధిలా వ్యవహరిస్తాయి అనే విషయాలను వివరించారు. దీనితోపాటుగా, బిఐఎస్ ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలను తీవ్రతరం చేయవలసిన అవసరాన్ని కూడా శ్రీ తివారీ వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన 200కిపైగా ప్రతినిధులు వెబినార్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా థింక్, నడ్జ్ ఉ మూవ్ విభాగం అధిపతి శ్రీ చందన్ బాల్ మాట్లాడుతూ, బిఐఎస్ చేపట్టిన ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలు, స్వచ్ఛందన, వినియోగదారుల సంస్థలు ఆ కార్యకలాపాలలో ఎక్కడెక్కడ నిమగ్నం కావచ్చో ప్రతినిధులకు వివరించారు. ప్రమాణాల క్లబ్బుల నిర్వహణ, చైతన్యపరిచే కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు సహా ప్రమాణాల ప్రోత్సాహక కార్యకలాపాలలో వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుపోయేందుకు బిఐఎస్ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలను ఆయన వివరించారు.

ఇటీవలే బిఐఎస్ అభివృద్ధి చేసిన కన్యూమర్ ఎంగేజ్‌మెంట్ పోర్టల్‌ను పాల్గొన్నవారికి ప్రదర్శించారు. తమ ప్రత్యేక ఎన్నివో దర్పన్ కార్టూను, పాన్ కార్డు నెంబరును వినియోగించి బిఐఎస్‌తో వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థలు సులువుగా నమోదు చేసుకోవడం అనే అంశాన్ని ఇందులో పొందుపరిచారు. బిఐఎస్ జారీ చేసిన మార్గదర్శకాలను, అందించే కార్యక్రమాలతో సహకరించేందుకు వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థలు అందించే ప్రతిపాదనలను చూసేందుకు సంబంధించిన ప్రక్రియలను కూడా ప్రదర్శించారు.

వెబినార్‌లో వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చురుకుగా పాల్గొని, బిఐఎస్ చొరవను ఆహ్వానించారు. దేశవ్యాప్తంగా ప్రమాణాలు, నాణ్యత సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు బిఐఎస్‌తో సహకరించేందుకు ఎదురుచూస్తున్నామని వారు డ్రోన్ ఆధారిత ఖనిజాన్వేషణకు ఐఐటీ ఖరగ్‌పూర్‌తో ఎన్ఎండీసీ అవగాహన ఒప్పందం

ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థ దేశంలో అతిపెద్ద ముడి ఇనుము ఉత్పత్తిదారు 'నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్' (ఎన్ఎండీసీ) డ్రోన్ ఆధారిత ఖనిజ అన్వేషణ చేపట్టనుంది. ఇందుకోసం ఐఐటీ ఖరగ్‌పూర్‌తో బుధవారం ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. జీ4 స్థాయి నుండి యుఎన్ఫీసీ యొక్క వివరణాత్మక జి1 స్థాయి వరకు రాగి, రాక్ ఫాస్ఫేట్, లైమ్‌స్టోన్, మాగ్నసైట్, వజ్రాలు, టంగ్‌స్టన్ మరియు బీచ్ సాండ్స్ వంటి విస్తృత శ్రేణి ఖనిజాల కోసం ఎన్ఎండీసీ ఆరు దశాబ్దాలుగా ఖనిజాలను అన్వేషిస్తోంది. 'డ్రోన్-ఆధారిత ఖనిజ అన్వేషణ'కు సంబంధించిన అవగాహన ఒప్పందం వర్చువల్ ప్లాట్‌ఫారమ్‌పై సంతకం చేయబడింది, ఈ కార్యక్రమానికి సీఎండీ శ్రీ సుమిత్ దేబ్ హాజరయ్యారు; ఎన్ఎండీసీ సంస్థ నుంచి శ్రీ అమితవ ముఖర్జీ, డైరెక్టర్ (ఫైనాన్స్); శ్రీ సోమనాథ్ నంది, డైరెక్టర్ (టెక్నికల్); శ్రీ డి.కె.మొహంతి, డైరెక్టర్ (ప్రొడక్షన్) పాల్గొనగా ఐఐటీ ఖరగ్‌పూర్ నుండి ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ అవగాహన ఒప్పందంపై ఎన్ఎండీసీ తరపున డైరెక్టర్ (ప్రొడక్షన్) శ్రీ డికె మహంతి మరియు ఐఐటీ ఖరగ్‌పూర్ తరపున జియాలజీ ఉ జియోఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి ప్రొఫెసర్ ఎస్పీశర్మ మరియు మైనింగ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి ప్రొఫెసర్ సమీర్ కె పాల్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండీసీ సంస్థ సీఎండీ శ్రీ సుమిత్ దేబ్ మాట్లాడుతూ, "దేశంలో ఖనిజాన్వేషణకు భారతదేశంలో డ్రోన్ ఆధారిత జియోఫిజికల్ సర్వేలు మరియు హైపర్‌స్పెక్ట్రల్ స్టడీస్‌ను నిర్వహిస్తున్న మొదటి ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ. ఐఐటీ-ఖరగ్‌పూర్‌తో ఎన్ఎండీసీ సంస్థ జట్టుకట్టడం కొత్త అధ్యాయానికి తెరతీస్తుంది మరియు దేశం కోసం ఖనిజ అన్వేషణ రంగంలో ఒక బెంచ్‌మార్క్‌గా నిలుస్తుంది. " ఎన్ఎండీసీ సంస్థ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ఖనిజాల కోసం మరియు చత్తీస్‌గఢ్‌లోని బెలోడా-బెల్కుండి బ్లాక్‌లో వజ్రాల కోసం అన్వేషణలను నిర్వహిస్తోంది. సెంట్రల్ ఇండియన్ డైమండ్ ప్రావిన్స్‌లో స్పేస్ జియోఫిజిక్స్‌ను ఉపయోగించిన మొదటి సీపీఎస్ఈ ఎన్ఎండీసీ. దీనికి తోడుగా సమాచార అన్వేషణ యొక్క ఆన్‌లైన్ పర్యవేక్షణను భువన్ ప్లాట్‌ఫారమ్‌లో డేటా ఉపయోగించిన మొదటిది సంస్థ కూడా ఇదే. అన్వేషణ మరియు మైనింగ్‌కు సంబంధించిన దాని డేటాబేస్ యొక్క సాంకేతిక ఆవిష్కరణ, డిజిటలైజేషన్ వ్యవస్థపై ఎన్ఎండీసీ ఎక్కువగా ఆధారపడుతోంది. డ్రోన్‌ల విధానాన్ని ప్రారంభించడంతో, భారతదేశంలో డ్రోన్ వినియోగం మరియు కార్యకలాపాలను నియంత్రించడానికి మరియు పర్యవేక్షించడానికి ప్రభుత్వం తొలి అడుగు వేసింది, వీటిని ప్రస్తుతం వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, అటవీ, మైనింగ్, విపత్తు నిర్వహణ, నిఘా, రవాణా మొదలైన రంగాలలో ఉపయోగిస్తున్నారు. మైనింగ్ కోసం డ్రోన్ (యుఏవీ)ని ఉపయోగించి అన్వేషణ కోసం ఎన్ఎండీసీ మరియు ఐఐటీ ఖరగ్‌పూర్ స్పెక్ట్రల్ ఉత్పత్తులు, పద్ధతులు మరియు అల్గారిథమ్‌లను అభివృద్ధి చేస్తాయి. ఎన్ఎండీసీ మరియు ఐఐటీ ఖరగ్‌పూర్ మధ్య సహకారం ఖనిజ తవ్వకం కోసం సాఫ్ట్‌వేర్ స్పెక్ట్రల్ సాధనాల అభివృద్ధికి మరియు మైనింగ్ టెక్నాలజీపై సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలకు దారి తీస్తుంది.

సుగుణ సాహితి సమితి సిద్ధిపేట

ఉగాది బాలల కథల పోటీ - 2022 ఫలితాలు

బాలలలో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి సిద్ధిపేట జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు కథల పోటీ నిర్వహించాలనే మా ప్రయత్నానికి మంచి స్పందన లభించింది. ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన బాల సాహితీవేత్త, ప్రముఖ కథా రచయిత్రి పులిమళ్ల సునంద గారికి ప్రత్యేక ధన్యవాదములు.

బహుమతి పొందిన కథల వివరాలు

ప్రథమ బహుమతి (1500/- నగదు):
- ఇష్టడం నేర్చుకోవాలి : ఇన్యారం వైష్ణవి (జ.ప.ఉ.పా. ఇందిరానగర్, సిద్ధిపేట)

ద్వితీయ బహుమతి (1000/- నగదు):
- సాధన : గంగాపురం తేజశ్రీ (మాస్టర్ మైండ్స్ స్కూల్, సిద్ధిపేట)

తృతీయ బహుమతి (500/- నగదు):
- కూతురు : సారుగు శ్రీజ (జ.ప.ఉ.పా. జక్కాపూర్)
- ముగ్గురు మిత్రులు : ఒగ్గు సునీత (జ.ప.ఉ.పా. లక్ష్మీదేవిపల్లి)

ప్రోత్సాహక బహుమతులు (300/- నగదు):
- వి.వి.టి. : బి. అభిరామ్ (జ.ప.ఉ.పా. ఇందిరానగర్, సిద్ధిపేట)
- డిప్పు ఒదిలిన తాబేలు : ఇ. హర్షిక (జ.ప.ఉ.పా. గుజ్జులగొంది)
- పచ్చని పల్లె : సిహెచ్. వర్ష (జ.ప.ఉ.పా. లక్ష్మీదేవిపల్లి)
- రైతు కన్నీరు : బి. చైత్ర (జ.ప.ఉ.పా. గుజ్జులగొంది)
- మార్పు : యస్.కె. ఆసియా (జ.ప.ఉ.పా. ముభారస్‌పూర్)
- గోవిందుని తెలివి : ఇ. గణేశ్ (జ.ప.ఉ.పా. ఇందిరానగర్, సిద్ధిపేట)
- అసలు విజయం : యం. పరుణ్‌తేజ్ (మెరీడియన్ హైస్కూల్, సిద్ధిపేట)
- తెలివైన మంత్రి : బి. భువనేష్ (జ.ప.ఉ.పా. జక్కాపూర్)
- అవ్వను చేరదీసిన మురళి : కె. శృతి (జ.ప.ఉ.పా. గుజ్జులగొంది)
- రంగు రంగుల కుండలు : జె. శ్రావ్య (జ.ప.ఉ.పా. గుజ్జులగొంది)

బహుమతి ప్రదాత : శ్రీ ఆచార్య మర్రడగ చెన్నకృష్ణారెడ్డి గారు
ఉస్మానియా విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు

అధ్యక్షులు: మొసర్ల మాధవరెడ్డి, సుగుణ సాహితి సమితి, సిద్ధిపేట.
కన్వీనర్: బైతి దుర్గయ్య, సుగుణ సాహితి సమితి, సిద్ధిపేట. 9959007914

సూరజ్ కుండ్ అంతర్జాతీయ హస్తకళా మేళా ప్రారంభం

న్యూఢిల్లీ, మార్చి 21:ముప్పై ఐదవ సూరజ్.కుండ్ అంతర్జాతీయ హస్తకళల మేళా (ప్రదర్శన)ను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ రోజు ప్రారంభించారు. ఫరీదాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమానికి హర్యానా పర్యాటక, అటవీ శాఖ, ఆతిథ్యం, కళలు, విద్య, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కన్వర్ పాల్, ఉజ్బెకిస్తాన్ రిపబ్లిక్ రాయబారి దిల్షోద్ అఖతోవ్, బద్దల్ ఎమ్మెల్యే సీమా తారీఖా, కేంద్ర విద్యుత్, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి కృష్ణపాల్, హర్యానా రవాణా, గనులు, భూగర్భవిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి మూల్ చంద్ శర్మ, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరవింద్ సింగ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రముఖులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.

హస్తకళల మేళా ప్రారంభోత్సవం సందర్భంగా గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, నాగరికత, సాంస్కృతిక అభివృద్ధిలో కళలు, హస్తకళలకు ఉన్న ప్రాధాన్యాన్ని గురించి వివరించారు. హస్తకళల మేళాను నిర్వహిస్తున్నందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మంత్రిత్వ శాఖలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భారతదేశంతోపాటు వివిధ దేశాల సుంపన్నమైన కళలను, హస్తకళలను, వారసత్వ సంపదను ప్రదర్శించేందుకు ఈ హస్తకళా మేళా అవకాశం ఇస్తుందని ఆయన అన్నారు.

హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది హస్తకళాకారులు తమ కళా ఖండాలను, ఉత్పాదలను మరింత విస్తృత స్థాయిలో కళాభిమానుల ముందు ప్రదర్శించేందుకు సూరజ్ కుండ్ హస్తకళల మేళా దోహదపడుతుందన్నారు. సుసంపన్నమైన భారతదేశ వారసత్వాన్ని, హస్త కళలను, కళాఖండాలను పునరుద్ధరించేందుకు కూడా ఈ మేళా ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం మనం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు సందర్భంగా జరుపుకుంటున్న ఈ సంవత్సరపు సూరజ్ కుండ్ హస్తకళల ప్రదర్శన మరింత ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. తొలిసారిగా 1987వ సంవత్సరంలో ఈ ప్రదర్శన జరిగిందని, ఈ సంవత్సరం 35వ ప్రదర్శనను నిర్వహించుకుంటున్నామని, హర్యానా కళాకారులకే కాక, దేశవ్యాప్తంగా ఉన్న హస్త కళాకారులకు కూడా ఇది వేదికగా ఉపయోగపడుతుందని, కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు, సుసంపన్నమైన మన వారసత్వ సంపదను, సంస్కృతిని పరిరక్షించేందుకు ఈ మేళా ఒక గొప్ప అవకాశమని ఆయన అన్నారు.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరవింద్ సింగ్ మాట్లాడుతూ, కోవిడ్ వైరస్ మహమ్మారి వ్యాప్తి కారణంగా సుదీర్ఘ విరామం తర్వాత 35వ సూరజ్ కుండ్ హస్తకళల ప్రదర్శన ఈ సారి జరుగుతోందని, ఎందరో ఎంతగానో ఎదురుచూసే ఈ ప్రదర్శన 2021లో నిర్వహించడం సాధ్యంకాలేదని అన్నారు. అయితే, ఈ సారి ఇనుమడించిన ఉత్సాహంతో మరింత భారీ స్థాయిలో హస్తకళల ప్రదర్శన జరుగుతోందని అన్నారు. హస్తకళల ప్రదర్శనను నిర్వహించేందుకు హర్యానా ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయమని, భారతదేశంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని ఆయన అన్నారు.

హర్యానా పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.డి. సిన్హా మాట్లాడుతూ, 43.5 ఎకరాల విస్తీర్ణంగల మైదానంలో ఈ ప్రదర్శన జరుగుతోందని, హస్తకళా నిపుణులకోసం 1,183 స్టాళ్లను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారని అన్నారు. దీనికి తోడుగా, బహుళ రుచుల వంటకాలతో కూడిన ఫుడ్ కోర్టు సందర్శకులను అలరిస్తోందని ఆయన అన్నారు. అంతర్జాతీయ హస్తకళల పరిసరాలన్నింటినీ అలంకృత చిత్రాలు, వర్ణ చిత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మహువా, నర్గిస్, పాంచజన్యతో పాటుగా, 75 సంవత్సరాల స్వాతంత్ర్య ఇతివృత్తంతో, స్వాతంత్ర్య పతకాల ప్రతిరూపాలతో, త్రివర్ణ కంబళ్లతో, సంస్మరణ స్తాంపులతో అలంకరించినట్టు ఆయన చెప్పారు. సూరజ్ కుండ్ ప్రదర్శన అనేది ఇపుడు అంతర్జాతీయంగా ఎంతో ప్రజాదరణ కలిగిన పర్యాటక ప్రదర్శన అని అన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని సృజనాత్మక విశేషాలతో ఈ ప్రదర్శనను మరింత భారీ స్థాయిలో తీర్చిదిద్దగలమని ఆయన అన్నారు.

భారతదేశపు సుసంపన్నమైన హస్తకళలను, చేనేత వస్త్రాలను, సాంస్కృతిక విశేషాలను ప్రదర్శించే లక్ష్యంతో సూరజ్ కుండ్ హస్తకళల ప్రదర్శనను తొలిసారిగా 1987లో నిర్వహించారు. సూరజ్ కుండ్ ప్రదర్శన ప్రాధికార సంస్థ, హర్యానా పర్యాటక శాఖ కలసి కేంద్ర పర్యాటక, జవుళి, సాంస్కృతిక, విదేశాంగ మంత్రిత్వ శాఖలు, హర్యానా ప్రభుత్వం సహకారంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తూ వస్తున్నారు. ఎంతో సౌందర్యదృష్టితో కళాత్మకంగా తీర్చిదిద్దిన పరిసరాల్లో భారతదేశ హస్తకళలను, సాంస్కృతిక, వారసత్వసంపదను, భారతీయ సంప్రదాయ వంటకాల రుచులను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అంతర్జాతీయ పర్యాటక క్యాలెండర్.లో ఇది ప్రస్తుతం ప్రముఖ స్థానం ఆక్రమించబోతోంది. కాలాగుణంగా వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రదర్శనను తిలకించేందుకు టికెట్లను ఆన్ లైన్ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. పేటీఎం ఇన్ సైడర్ వంటి పోర్టల్స్ ద్వారా సందర్శకులకు ఈ టికెట్లను అందుబాటులో ఉంచారు. పొడవాటి క్యూలలో నిల్చుకోవలసిన అవసరం లేకుండా సందర్శకులు టికెట్లు పొందడానికి, సులభంగా ప్రదర్శనలోకి ప్రవేశించడానికి ఈ పోర్టల్స్ వీలు కల్పిస్తున్నాయి. చుట్టు పక్కల వివిధ ప్రాంతాలనుంచి వచ్చే సందర్శకుల సౌలభ్యం కోసం ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేశారు.

35వ సూరజ్ కుండ్ అంతర్జాతీయ హస్తకళల ప్రదర్శనలో 'ప్రధాన ఇతివృత్త రాష్ట్రం'గా జమ్ము కాశ్మీర్.ను ఎంపిక చేశారు. జమ్ము కాశ్మీర్ విభిన్నమైన సంస్కృతీ సంప్రదాయాలను, వారసత్వ సంపదను, వివిధ రకాల హస్తకళారూపాల ద్వారా ఈ మేళాలో ప్రదర్శిస్తున్నారు. వందలాదిమంది జమ్ము కాశ్మీర్ కళాకారులు వివిధ రకాల జానపద కళలను, నృత్యాలను ప్రదర్శించనున్నారు. సంప్రదాయ నృత్యాలతో పాటుగా, సుందరమైన హస్తకళలతో జమ్ము కాశ్మీర్ సాంస్కృతిక వైభవాన్ని సందర్శకులకు కళ్లకుకట్టినట్టుగా ప్రదర్శిస్తారు. వైష్ణవదేవి ఆలయం, అమర్ నాథ్ క్షేత్రం ప్రతిరూపాలతో పాటుగా, కాశ్మీర్ వాస్తు శిల్ప కళను ప్రతిబింబించే అప్నా ఘర్ కళారూపాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాగే, హౌస్ బోట్ ప్రదర్శన, 'జమ్ము-ముబారక్ మండీ' ఈ సారి ప్రధాన ఆకర్షణగా సందర్శకులను అలరించబోతున్నాయి.

2013లో సూరజ్ కుండ్ హస్తకళల ప్రదర్శన అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. 2020వ సంవత్సరంలో యూరప్, ఆఫ్రికా, ఆసియా ప్రాంతాలకు చెందిన 30దేశాలు ఈ ప్రదర్శనలో పాలుపంచుకున్నాయి. ఈ సంవత్సరం భాగస్వామ్య దేశమైన ఉజ్బెకిస్తాన్ తో పాటుగా 30దేశాలకు పైగా పాల్గొంటున్నాయి. లాటిన్ అమెరికా దేశాలు, ఆఫ్ఘనిస్తాన్, ఇతియోపియా, ఎస్వాటినీ, మొజాంబిక్, టాంజానియా, జింబాబ్వే, ఉగాండా, నమీబియా, సుడాన్, నైజీరియా, ఈక్విటోరియల్ గినియా, సెనెగల్, అంగోలా, ఘనా, థాయిలాండ్, నేపాల్, శ్రీలంక, ఇరాన్, మాల్దీవులు తదితర దేశాలు ఈ సారి ఉత్సాహంగా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

సందర్శకుల మానసిక ఉల్లాసం కలిగించేందుకు వివిధ రాష్ట్రాల కళాకారులతో పాటుగా, ఈ ప్రదర్శనలో పాలుపంచుకుంటన్న వివిధ దేశాల అంతర్జాతీయ జానపద కళాకారులచేత అద్భుతమైన ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

పంజాబ్ కు చెందిన బాంగ్డా, అస్సాం రాష్ట్రానికి చెందిన బిహూ, బర్సానా కీ హోలీ, హర్యానాకు చెందిన లోక్ నృత్యం, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జమాక్డా, మహారాష్ట్రకు చెందిన లావ్నీ నృత్యాలు, హత్ చక్కీ ప్రదర్శన, ప్రసిద్ధి పొందిన బెహురూపియా ప్రదర్శనలు వీక్షకులను, కళాభిమానులను ఎంతగానో అలరించబోతున్నాయి.

ఇక మేళాలో పక్షం రోజులపాటు సాయంత్ర వేళల్లో నిర్వహించే పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులకు ప్రధాన ఆకర్షణలుగా నిలువనున్నాయి. రెహ్మత్ ఇ నుస్రత్ వంటి బ్యాండ్ వాయుద్యాలు, రింకూ కాలియా ఆలపించే ఘజల్లు, చక్కని ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనలు, సూఫీ గీతాగానం, మాతీ బానీ ప్రదర్శించే భారతీయ శ్రుతి లయలు, జమ్ము కాశ్మీర్, ఉజ్బెకిస్తాన్, ఇతర అంతర్జాతీయ కళాకారుల సంగీత-నృత్య ప్రదర్శనలు కూడా ఉంటాయి. చౌపాల్ రంగస్థల థియేటర్ లో సాయంత్రం ఏడు గంటలనుంచి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

హర్యానా ప్రజల జీవనశైలిని గురించి తెలియజెప్పేందుకు అదే రాష్ట్రానికి చెందిన ఒక కుటుంబం ప్రత్యేకంగా సృష్టించిన 'అప్నా ఘర్'లో నివసిస్తుంది. హర్యానా రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని గురించి సందర్శకులు తెలుసుకునేందుకు, సంస్కృతీ సంప్రదాయాలను వారినే అడిగి తెలుసుకునేందుకు 'అప్నా ఘర్' దోహదపడుతుంది. సంప్రదాయబద్ధమైన మట్టి పాత్రలు, వంటపాత్రల గురించి తెలుసుకునేందుకు కూడా అప్నాఘర్ వీలు కల్పిస్తుంది. ఈ సంప్రదాయ కళలను హస్తకళాకారులు సందర్శకులకు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపుతారు. ప్రదర్శనలన్నింటినీ సజీవ రూపంలో తీర్చిదిద్దేందుకు రెండు చౌపాల్ ఆంఫీ థియేటర్లను అందంగా, ఆకర్షణీయంగా అలంకరించారు.

2022 మార్చి 19వ తేదీన మొదలైన ఈ హస్తకళల ప్రదర్శన 2022 ఏప్రిల్ 4వ తేదీవరకూ కొనసాగుతుంది. ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30నుంచి రాత్రి తొమ్మిదిన్నర వరకూ నిర్వహిస్తారు.

35వ సూరజ్ కుండ్ అంతర్జాతీయ హస్తకళల మేళా-2022 ప్రధాన ఆకర్షణలు.

-ఈ ఏడాది ప్రదర్శనకు గాను ఉజ్బెకిస్తాన్ భాగస్వామ్యదేశంగా ప్రాతినిధ్యం వహిస్తుంది.

-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తాజా ప్రగతిని దృష్టిలో పెట్టుకుని మేళా ప్రవేశ రుసం టికెట్లను పేటీఎం ఇన్.సైడర్ పోర్టల్ ద్వారా సందర్శకులు ముందే బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

-సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సృజనాత్మక ఆవిష్కరణల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేని రీతిలో వాహనాల పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

-వర్చువల్ టూర్.ను, హస్తకళాకారుల సమాచారాన్ని వెబ్.సైట్లో అందుబాటులో ఉంచారు.

-రాజస్థాన్ కు చెందిన కచ్చీ ఘోడీ, కర్రపై నడక, కల్బేలియా, బెహ్రూపియా, హిమాచల్ ప్రదేశ్.కుచెందిన కాంగ్డీ నాటీ, అస్సాంకు చెందిన పీహూ, పంజాబ్.కు చెందిన బాంగ్రా, జిందువా, ఝూమర్, ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన చపేలీ, ఉత్తరప్రదేశ్ కు చెందిన బర్సానా కీ హోలీ, మేఘాలయకు చెందిన వాంగియా, ఒడిశాకు చెందిన సంబాల్పూరీ, మధ్యప్రదేశ్ కు చెందిన బధాయీ, మహారాష్ట్రకు చెందిన లావ్నీ తదతర సంప్రదాయ, సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనలను కళలు, సాంస్కృతిక వ్యవహారాల శాఖ నిర్వహిస్తుంది.

-కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సూరజ్ కుండ్ మేళా ప్రాధికార సంస్థ కొన్ని వర్గాల వారికి టికెట్లలో 50 శాతం రాయితీ కల్పిస్తుంది. విభిన్న సామర్థ్యాలు కలిగిన వారికి, వయోవృద్ధులకు, రక్షణ శాఖ సిబ్బందికి, మాజీ సైనికులకు ఈ రాయితీ వర్తిస్తుంది.

-హర్యానాకు చెందిన సుప్రసిద్ధ కళా రూపమైన 'అప్నాఘర్' ఈ సారి సందర్శకులను కొత్త రూపుతో అలరిస్తుంది.

-పాఠశాల విద్యార్థులకు ఈ సారి ఎన్నో పోటీలను నిర్వహిస్తారు.

-మేళా జరిగే వక్షం రోజుల్లో ఎగుమతుదార్లు, కొనుగోలుదార్లతో సమ్మేళనాన్ని నిర్వహిస్తారు. హస్తకళాఖండాల కళాకారులు తమ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశాన్ని ఈ సమ్మేళనం కల్పిస్తుంది.

-భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసేందుకు మేళా మైదానంలో వందకు పైగా సి.సి.టి.వి. కెమెరాలను ఏర్పాటు చేశారు. మహిళా గార్డులతో సహా పెద్ద సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను మేళా ఆవరణకు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయని రీతిలో ఈ భద్రతా ఏర్పాట్లను కల్పించారు.

-మేళా పార్కింగ్ స్థలంలోకి ప్రవేశించే వివిధ రకాల వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే ఎలెక్ట్రానిక్ నిఘా కోసం అధునాతనమైన ఎన్.పి.ఆర్. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు.

-హాజరయ్యే సందర్శకుల సంఖ్యను లెక్కించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టారు.

-అనుమతిలేనిదే అనధికారికంగా ఎవరూ మేళా ఆవరణలోకి ప్రవేశించకుండా నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేశారు.

-సిల్వర్ జూబ్లీ గేటుకు ఆనుకొని ఉన్న ఎం.సి.ఎఫ్. ఖాళీ స్థలంలో వాహనాలు నిలిపేందుకు 2-3 ఎకరాల అదనపు స్థలాన్ని అందుబాటులో ఉంచారు.

-మేళా జరిగినన్ని రోజులూ ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అగ్నిమాపక దళం, వైద్య బృందాలు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశారు.

-ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో తగిన నిర్వహణా ప్రణాళిక/ సందర్శకులను, ప్రజలను ఖాళీ చేయించే ప్రణాళికలను కీలక ప్రాంతాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేశారు. అగ్నిమాపక దళం, వైద్య బృందాలతో ఈ ఏర్పాట్లు చేశారు.

-కేంద్రీకృతంగా అందుబాటులో ఉండేలా బ్యాంకు, ఆసుపత్రి, మేళా పోలీస్ కంట్రోల్ రూం, సి.సి.టి.వి. కంట్రోల్ రూమ్ వంటివి ఏర్పాటు చేశారు. ముఖ్యమైన ఈ సేవలను సందర్శకులు, భాగస్వామ్య వర్గాల ప్రతినిధులు సులభంగా వినియోగించుకునే ఏర్పాటు చేశారు.

-విభిన్న సామర్థ్యాలు కలిగిన వారికోసం మరింత మెరుగైన సదుపాయాలను ఏర్పాటు చేశారు.

-మేళా పరిధిలో ప్లాస్టిక్/పాలిథీ

మల్కాపేట్ సౌడలమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న రాజన్న ఆలయ మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 21:(నేటినిజం ప్రతినిధి): కొనరావుపేట మండలం లోని మల్కాపెట్ గ్రామంలో సోమవారం సౌడలమ్మ కళ్యాణమహోత్సవంకార్యక్రమంలో రాజన్న ఆలయ మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన అసౌడలమ్మను కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, జిల్లా కార్యదర్శులు కచకాయల ఎల్లయ్య ,కరోల భాస్కర్, తాళ్లపెల్లి ప్రభాకర్, శ్రీనివాస్ గౌడ్, బోర రవి బోయిని దేవరాజ్, కుంట శ్రీను ,పాకాల తిరుపతి,శోభన్ మరియు యాదవ సంఘము సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, మార్చి 21:(నేటినిజం ప్రతినిధి):కథల పూర్ మండలం లోని పలు గ్రామ లలో ఇటీవలే మరణించిన వారి కుటుంబ సభ్యులను స్థానిక ప్రజా ప్రతినిధి కలిసి వేములవాడనియోజక వర్గ టీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు .అనంతరం

బొమ్మెన గ్రామానికి చెందిన పిడుగు ఆనంద్ రెడ్డి అన్న మరణించగా వారి కుటుంబాన్ని సిరికొండ గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నాయకులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి , కొడిపెల్లి నరేందర్ రెడ్డి, బెల్లల రాజం ఈ కుటుంబాలకు పరామర్శించి అనంతరం చింతకుంట గ్రామానికి చెందిన బైర మల్లేశం యాదవ సంగం జిల్లా అధ్యక్షులు ఇటీవల క్రితం అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యాన్నికల్పించారు .మనోహర్ రెడ్డి వెంట జెడ్పీ టీ సి నాగం భూమయ్య,ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్ ,మండల శాఖ అధ్యక్షులు గంగా ప్రసాద్, ఏం సి చైర్మెన్ చైర్మెన్ నాగేశ్వర్ రావు,సర్పంచ్ లు పిడుగు లావణ్య తిరుపతి రెడ్డి, గాండ్ల వీణ స్వామి,ఎంపిటిసి దొప్పాల హైమవతి జలంధర్,ఎంపిటిసి మల్యాల రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నాంపల్లి లింబాద్రి,కో ఆప్షన్ సభ్యులు ఎండి రఫీ,సింగిల్ విండో చైర్మెన్ చుక్క దేవరజం,రైతు సంఘం అధ్యక్షులు గడ్డం భుమరెడ్డి, ముదం రవి, హరీష్ రెడ్డి ,అల్లే సంతోష్,జవ్వాజి శ్రీను, ఎంబరీ వ్యాస మహర్షి,మంచల మహేష్, ముజీబ్, తదితులున్నారు

భారతదేశంలో ట్రిలియన్ డాలర్ల కంపెనీలను నెలకొల్పవచ్చు - శ్రీ గోయల్

న్యూఢిల్లీ, మార్చి 21:ఈ – కామర్స్‌ను బలోపేతం చేసి చిన్న వ్యాపారుల ప్రయోజనాలను రక్షించేందుకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎండీసీ) తోడ్పడుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమ, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ, జౌళిశాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అన్నారు. బిట్స్ పిలానీ ఈ రోజు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం వరుసగా ఐదో సారి ఏర్పాటు చేసిన సదస్సు ను శ్రీ గోయల్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ గోయల్ ఈ-కామర్స్ తో పాటు చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందేందుకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎండీసీ) సమాన అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. సమావేశానికి ముందు బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థి శ్రీ శ్రీ నానాజీ దేశ్‌ముఖ్‌కు శ్రీ గోయల్ నివాళులు అర్పించారు. శ్రీ నానాజీ దేశ్‌ముఖ్ దేశానికి ఎనలేని సేవలు అందించి అందరికి ఆదర్శంగా నిలిచారని శ్రీ గోయల్ అన్నారు.

నాయకులు వారిని అనుసరించే వారి మధ్య ఉండే తేడాను ఆవిష్కరణలు గుర్తు చేస్తాయి" అంటూ స్టీవ్ జాబ్స్ చేసిన వ్యాఖ్యలను శ్రీ గోయల్ గుర్తు చేశారు. బిట్స్ పిలానీ లో విద్యను అభ్యసించిన విద్యార్థులు చలన చిత్ర రంగం, రచనా రంగం, వ్యాపార రంగం, సేవా రంగాలలో స్థిరపడి రాణించి గుర్తింపు సాధించారని మంత్రి పేర్కొన్నారు.

జ్ఞానమే అత్యున్నత ఆయుధం ' అన్న దృఢ విశ్వాసంతో బిట్స్ పిలానీ పనిచేస్తున్నదని శ్రీ గోయల్ అన్నారు.విజ్ఞానం తో ముడిపడిన ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా బిట్స్ పిలానీ విద్యా విధానం ఉందని అన్నారు. ఆవిష్కరణలు మరియు వ్యవస్థాపకత రంగాల్లో బిట్స్ పిలానీ విద్యార్థులు ప్రపంచంలో తమకంటూ ఒక పేరు, గుర్తింపు పొందారని మంత్రి అన్నారు, భారతదేశంలోని యునికార్న్‌లలో 10% యునికార్న్‌లను బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులు స్థాపించారని వివరించారు. అంకుర సంస్థల స్థాపన, అభివృద్ధి అంశాలలో ప్రయోగశాలలు, మార్గదర్శకత్వం , ఇంక్యుబేటర్లు మరియు నిధులు నాలుగు ముఖ్యమైన అంశాలుగా ఉంటాయని శ్రీ గోయల్ అన్నారు.

కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న సమయంలో విద్యార్థులు వినూత్నంగా ఆలోచించే విధంగా ప్రోత్సహించే విద్యా కార్యక్రమాలను బిట్స్ అమలు చేస్తున్నదని శ్రీ గోయల్ అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా విద్యా భోధన జరగాలని అన్నారు. విస్తృతంగా సంప్రదింపులు జరిపి ఇటీవల అమలులోకి తెచ్చిన తెచ్చిన నూతన విద్యా విధానంలో ఇదే అంశానికి ప్రాధాన్యత లభించిందని శ్రీ గోయల్ అన్నారు. బిట్స్ పిలానీ అనుసరిస్తున్న విద్యా విధానాన్ని అనుసరించి ఉద్యోగాల కోసం ఎదురు చూసే విద్యార్థులను కాకుండా ఉ ద్యోగాలు ఇచ్చేవారిగా విద్యార్థులను తీర్చిదిద్దాలని శ్రీ గోయల్ ఇతర విద్యా సంస్థలకు సూచించారు.

దేశాభివృద్ధికి అంకుర సంస్థలు అత్యంత కీలకమని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. ప్రపంచంలో అంకుర సంస్థల స్థాపన రంగంలో ప్రపంచంలో భారతదేశం మూడవ స్థానంలో ఉందని శ్రీ గోయల్ పేర్కొన్నారు. డీపీఐఐటీ లో నమోదైన అంకుర సంస్థల సంఖ్య గత ఐదేళ్ల కాలంలో 500 నుంచి 65,000 వరకు పెరిగిందని వివరించారు. దేశంలో 90కి పైగా యునికార్న్‌లు ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

'ఒక ఆలోచన జీవితాన్ని మార్చివేస్తుంది' అని స్పష్టం చేసిన శ్రీ గోయల్ ఈ సందర్భంగా యూఎస్ బీ సృష్టికర్త వడోదరకు చెందిన శ్రీ అజయ్ బట్ ను ప్రస్తావించారు. ఎక్కడికైనా సులువుగా సమాచారాన్ని తీసుకుని వెళ్లేందుకు శ్రీ అజయ్ బట్ అభివృద్ధి చేసిన యూఎస్బీ సహాయపడుతుందని అన్నారు.

వ్యవస్థాపక రంగం అనేక సవాళ్లు, అంతరాయాలతో కూడుకుని ఉంటుందని శ్రీ గోయల్ అన్నారు. దేశంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో వస్తువులను కొనుగోలు చేసే విధానం, డిజిటల్ ఆరోగ్య సంప్రదింపులు పొందడం , యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడం వంటి అనేక సమస్యలు ఎదురయ్యాయని తెలిపిన మంత్రి ప్రస్తుతం ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు.

వైఫల్యాలతో నిరాశ చెందవద్దని పారిశ్రామికవేత్తలకు మంత్రి సలహా ఇచ్చారు. వ్యాపారంలో వైఫల్యం అనేది ఒక భాగంగా ఉంటుందని గుర్తించి ముందుకు సాగాలని అన్నారు. ప్రశాంతంగా ఆలోచించి, విజయం సాధించేందుకు మరింత కృషి చేసి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని బిట్స్ సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని శ్రీ గోయల్ అన్నారు.

అభివృద్ధి సాధించేందుకు అవసరమైన శక్తి, సౌకర్యాలను భారతదేశం కలిగి ఉ ందని శ్రీ గోయల్ అన్నారు. తాత్కాలిక అభివృద్ధి కాకుండా శాశ్వత అభివృద్ధి సాధన దిశగా దేశం అడుగులు వేస్తున్నదని అన్నారు. ఆత్మ నిర్భరత సాధించిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని శ్రీ గోయల్ అన్నారు.

ఆర్థిక, వ్యవసాయ సాంకేతిక అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్న భారతదేశం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఐటీ +ఐటీ + ఐటీ (సమాచార సాంకేతికత + భారత మేధస్సు + రేపటి భారతదేశం) మంత్రంతో పురోగతి సాధిస్తున్నదని అన్నారు. ఐటీ, అనుబంధ రంగాలను ట్రిలియన్ డాలర్ల పరిశ్రమగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు.

డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడంలో భారతదేశం అగ్రగామిగా ఉందని శ్రీ గోయల్ తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌ల వ్యాప్తి మరియు తక్కువ ధర అంతరాయం లేని డేటా ను అందించేందుకు ఆవిష్కరణలు పునాది వేశాయని మంత్రి అన్నారు. ఇండియాస్టాక్, హెల్త్‌స్టాక్, లాజిస్టిక్స్ స్టాక్, కోవిన్ వంటి డిజిటల్ మౌలిక సదుపాయాలు కలిగిన భారతదేశంలో తదుపరి ట్రిలియన్ డాలర్ల కంపెనీలను ఏర్పాటు చేయవచ్చునని ఆయన అన్నారు.

ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసే అంశంలో భారతదేశాన్ని అనుసరిస్తున్నాయని శ్రీ గోయల్ అన్నారు. భారతదేశంలో గతంలో ఎన్నడూ సాగని విధంగా వేగంగా, విస్తృతంగా సాగుతున్న డిజిటలైజేషన్ పై పీహెచ్డీ చేయవచ్చునని శ్రీ గోయల్ అన్నారు.

అంకుర సంస్థల స్థాపన, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను శ్రీ గోయల్ వివరించారు. వీటికి అవసరమైన సౌకర్యాలు, నిధులు అందిస్తున్న కేంద్రం మూడు సంవత్సరాలపాటు ఆదాయం పన్ను మినహాయింపు ఇచ్చిందని అన్నారు. వీటితోపాటు, కొత్త ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్ల కోసం పరీక్ష వ్యవధిని తగ్గించడం , సీడ్ ఫండ్ స్కీమ్ లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. యువత సాలలు సాకారం అయ్యేలా చూసేందుకు గతంలో ఎదురైన సమస్యలు పరిష్కరించి ప్రోత్సహిస్తుందని అన్నారు.

దేశంలో అంకుర సంస్థల రంగం విస్తరించిందని శ్రీ గోయల్ అన్నారు.జాతీయ స్టార్టప్ అవార్డు గ్రహీతలు కొచ్చి, లక్నో, సోనిపట్ వంటి చిన్న నగరాలకు చెందిన వారు కావడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.

నూతన రంగాలపై దృష్టి సారించాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శ్రీ గోయల్ సూచించారు. వైవిధ్యంతో , కొత్త వ్యాపారాలను అన్వేషించి అగ్రి-ప్రెన్యూర్‌లను (అగ్రి సెక్టార్ ఎంటర్‌ప్రెన్యూర్స్), టెక్స్-ప్రెన్యూర్స్ (టెక్స్‌టైల్స్), ఎడ్యు - ప్రెన్యూర్స్ (ఎడ్యుకేషన్)గా మారాలని అన్నారు. మెటావర్స్, వెబ్ 3, ఎఐ, 5జి వంటి సైబర్ సెక్యూరిటీ వంటిఅంశాలపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలు చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆయన కోరారు.

వ్యక్తిగతంగా లేదా అందరూ కలిసి ఈ సాంకేతికతలను ఉపయోగించుకునే మార్గాల గురించి ఆలోచించాలని శ్రీ గోయల్ కోరారు . సుస్థిరత మరియు వృత్తాకార ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఇది అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పు, స్థిరమైన చలనశీలత, నీటి నిర్వహణ మొదలైన రంగాల్లో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనడంలో పెద్ద వ్యాపార అవకాశాలు అందుబాటులో ఉంటాయని అన్నారు.

ఒక సాధారణ వ్యక్తి అసాధారణ వ్యక్తిగా మారవచ్చు ' అన్న ఎలోన్ మస్క్‌ని మాటలను శ్రీ గోయల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కలలను సాకారం చేసుకునే ధైర్యం ఉన్నవారిదే భవిష్యత్తు అన్న వాస్తవాన్ని విద్యార్థులు గుర్తించాలని అన్నారు . ఆవిష్కరణలు దేశంలోని ప్రతి మూలకు మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చేరాలని ఆయన అన్నారు.

నేటి అంకుర సంస్థలు రేపటికి అగ్రగామి సంస్థలు గా నిలుస్తాయన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తూ కోట్లాది మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి యువ పారిశ్రామికవేత్తలు కృషి చేయాలని కోరారు.

ప్రమాద బాధితులకు హెల్ప్ చేస్తే ఆర్థిక సాయం.. మెడల్స్.. ప్రకటించిన సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 21:తమిళనాడు సర్కారు మరో వినూత్న పథకం అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు సీఎం ఎంకే స్టాలిన్? ఈ వివరాలను ట్విట్టర్? ద్వారా సోమవారం తెలియజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సదుపాయాలను అందించడంలో సహాయపడే వారికి నగదు పురస్కారం అందిస్తామన్నారు.

అంతేకాకుండా వారికి రివార్డులు, ధ్రువీకరణ పత్రాలు కూడా ఇస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న వారికి సహాయం చేసి, గోల్డెన్ అవర్ వ్యవధిలో వారికి వైద్యం అందేలా కృషి చేసిన వారికి ప్రశంసా పత్రంతో పాటు రూ.5వేల నగదు బహుమతి కూడా ఇస్తామని సీఎం తెలిపారు. ఈ మేరకు ఈ వివరాలన్నీ ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

నల్గొండ, మార్చి 21:ప్రజావాణిలో ప్రజలు అందజేసిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి 42 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేకుండా సత్వరమే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆమె జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులలో రెవెన్యూ శాఖ 36, జిల్లా మైనార్టీ అభివృద్ధి శాఖ 2, భువనగిరి మున్సిపాలిటీ 1, డ్రగ్ ఇన్స్పెక్టర్ 1, ధరణి 1, డి.ఎం.సి.ఎస్. 1 చొప్పున 42 ఫిర్యాదులు అధినట్లు చెప్పారు.

భారీ నగదుతో గార్డులకు పట్టుబడిన - ఉక్రెయిన్ మాజీ ఎంపీ భార్య

న్యూఢిల్లీ, మార్చి 21:ఉక్రెయిన్ పై రష్యా యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధం ఫలితంగా ఉక్రెయిన్ అంతటా 10మిలియన్ల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వీరిలో దాదాపు 3.4 మిలియన్లు పోలాండ్, స్లోవేకియా, రొమేనియా, హంగేరీ వంటి పొరుగు దేశాలకు పారిపోయారు.అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య దేశాలు రష్యాపై కఠినమైన ఆంక్షలు, ఆర్థిక జరిమానాలు విధించాయి. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ (జివశ్రీవనిబఎఎ) ఆదివారం ప్రకటించారు. దౌత్యం విఫలమైతే మూడో ప్రపంచయుద్ధం వస్తుందనే భయాందోళనలను ఆయన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా చర్చలకు తాను సిద్ధంగానే ఉన్నానని చెప్పారు. చర్చలు చేపట్టకుండా, సంధి కాకుండా మరో మార్గంలో యుద్ధం ముగుస్తుందని తాను అనుకోవడం లేదని తెలిపారు. ఈ క్రమంలో ఉక్రెయిన్ కు చెందిన మాజీ ఎంపీ (ఈనీతీఎవతీ ఓఖ) భార్య కూడా దేశం విడిచి వెళ్లిపోవాలని భావించారు. కానీ ఆమె వెంట భారీ స్థాయిలో నగదును తెచ్చుకుంది. అంత డబ్బుతో సరిహద్దులు దాటే ప్రయత్నం చేస్తుండగా పట్టుబడింది. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తన సూట్ కేసుల్లో 8 మిలియన్ డాలర్లు, 1.3 మిలియన్ యూరోల నగదుతో దేశం విడిచి పారిపోవడానికి ప్రయత్నించింది. జకర్‌పట్టియా ప్రావిన్స్ మీదుగా హంగేరీలోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేసింది. అయితే ఆమె హంగేరియన్ సరిహద్దులో గార్డులకు పట్టుబడింది. ఈ విషయాన్ని ఔఇచీం మీడియా సంస్థ వెల్లడించింది.

75 ఏళ్ల తర్వాత ఎగిరిన భారత జెండా

కోలార్, మార్చి 21: కర్ణాటక, కోలార్‌లోని క్లాక్ టవర్‌పై తొలిసారిగా భారత జెండాను ఎగరేశారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య జిల్లా అధికారులు శనివారం జెండా ఎగరేశారు. కోలార్‌లోని క్లాక్ టవర్‌కు దశాబ్దాల చరిత్ర ఉంది. దాదాపు 75 ఏళ్లుగా ఈ టవర్ ఆకుపచ్చ రంగులోనే ఉంటుంది. అప్పట్నుంచి దీనిపై ఇస్లామిక్ జెండాలు ఎగురుతూనే ఉండేవి. అయితే, కొంతకాలంగా ఈ టవర్ విషయంలో వివాదం చెలరేగుతోంది. టవర్ రంగు మార్చాలని, టవర్‌పై ఉన్న జెండాలను తొలగించి మూడు రంగుల భారత జెండా ఎగరేయాలని స్థానిక ఎంపీ మునిస్వామితోపాటు పలువురు డిమాండ్ చేశారు. దీంతో చాలాకాలంగా వివాదం నడిచింది. గత శుక్రవారం కూడా మునిస్వామి ఈ అంశంపై ఆందోళన నిర్వహించారు. ఈ వివాదం నేపథ్యంలో అక్కడ 144 సెక్షన్ విధించాల్సి వచ్చింది. చివరకు గత శనివారం పోలీసుల భద్రత మధ్య టవర్‌కు తెలుపు రంగు వేశారు. టవర్‌పై ఉన్న జెండాలను తొలగించిన అధికారులు మూడు రంగుల భారత పతాకాన్ని ఎగురవేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు తీసుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపి, వివాదం తలెత్తకుండా చూశారు.

అది తప్పుడు ప్రచారం..ప్రజలు ఎవరు కూడా భయపడొద్దు : ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, మార్చి 21:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో జనశక్తి నక్సలైట్స్ ఆయుధాలతో సమావేశం పెట్టారు అనే వార్త కొన్ని న్యూస్ ఛానెల్స్,సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నాయి. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. అలాంటి సమావేశాలు జిల్లాలో జరగలేదని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో జనశక్తి మూమెంట్ లేదు అని, ప్రజలు ఎవరు కూడా భయపడవద్దన్నారు.

అలాంటి సమాచారం ఉంటే దగ్గరలో గల పోలీస్ స్టేషన్‌లో సమాచార ఇవ్వాలని సూచించారు. జనశక్తి పేరు మీద ఎవరన్నా ఫోన్ కాల్ చేసి బెదిరిస్తే.. సమాచారం ఇవ్వాలని, నిందితులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD M.V.O.P. NO.341 OF 2016

Between:

Mr. G. Sudheer Babu
.....Petitioner

And

Mr. R . Kuchi Reddy and others
..Respondents

To

1) Mr. Ramidi Kuchi Reddy S/o. Balanarasimha Reddy Age: Major, Occ: Owner of Ready Mix Lorry bearing No. AP 28Y 5168,R/o. Survey No. 657/1 and 658/1,Dundigal Village, Quthbullapur, Hyderabad
...Respondents No. 1

2) Mr. Md. Abdul Hussain S/o A. Soirul Islam Age: 26 years, Occ: Owner of Ready Mix Lorry bearing No.AP 28Y 5168, R/o. Survey No. 657/1 and 658/1, Dundigal Village, Quthbullapur, Hyderabad.
...Respondents No.3

Whereas the above named Petitioners filed compensation petition against you and Bajaj Allianz General Insurance Company Ltd, for a sum of Rs.2,00,000/- for the accident caused by your vehicle Ready Mix Lorry bearing No.AP 28Y 5168 on 03-09-2014 at Dundigal ps Limites. The above case is posted to **23-03-2022.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE Honble COURT)

C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18, Swaroop Nagar Uppal, Hyderabad
Ph: 9440431541

షోటోకాన్ కరాటే ఇండియన్ అకాడమీ ఇండియా ఉపాధ్యక్షుడిగా పెద్ది సందీప్ , జాయింట్ సెక్రటరీగా పెద్ది అనుదీప్

కరీంనగర్ ,మార్చి 21: (నేటినిజం ప్రతినిధి): కాంటినెంటల్ షోటోకాన్ కరాటే ఇండియన్ (సి ఎస్ కె ఐ) అకాడమీ ఉపాధ్యక్షులు గా పెద్ది సందీప్, జాయింట్ సెక్రటరీ గా పెద్ది అనుదీప్ నియమించినట్టుకాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా (సి ఎస్ కె) ఇండియా చీఫ్ ఈశ్రీనివాస్ ,చైర్మన్ చల్ల హరిశంకర్,ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందీప్,అనుదీప్ మాట్లాడుతూ తమను మించిన అకాడమీ చీఫ్ ఈ శ్రీనివాస్, చైర్మన్ చల్ల హరి శంకర్ ప్రధాన కార్యదర్శి పవీన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయిలో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

కరీంనగర్ ,మార్చి 21: (నేటినిజం ప్రతినిధి):ఈనెల 25, 26, 27 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలో జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడా పోటీలు కరీంనగర్ జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులతో క్రీడాకారులు సోమవారం శ్యామ్ ప్రసాద్ లాల్ తో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి షూటింగ్ పోటీల్లో విజయం సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అని అన్నారు . క్రీడాకారులకు అన్ని వేళలా అండగా ఉంటామని అదనపు కలెక్టర్ అన్నారు జిల్లా నుండి జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు . చింతల రాజేశ్వరి,కొమ్ముల మౌనిక , గెల్లు సంతోశిన్, సింగారపు సునాహిని. రమేష్, . రంజిత్ . ఎస్ శ్రీకాంత్ ఉన్నారు ఈ కార్యక్రమంలో సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిడి శంకరయ్య,కరీంనగర్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మఫజిల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పెగాసెస్ పై అసెంబ్లీలో చర్చ జరగాలి: అచ్చెన్నాయుడు

అమరావతి, మార్చి 21:పెగాసెస్ సాఫ్ట్ వేర్‌పై అసెంబ్లీలో చర్చ జరగాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం ఆయన సభలో మాట్లాడుతూ శాసనసభలో చర్చ జరిపి నిజానిజాలు ప్రజలకు చెప్పాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై బురద చల్లేందుకే పశ్చిమబెంగాల్ సీఎం మమతతో ఫేక్ మాటలు చెప్పించారని ఆయన విమర్శించారు. పెగాసెస్ సాఫ్ట్ వేర్‌పై పార్లమెంట్‌లో జరిగిన చర్చపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎందుకు మాట్లాడలేదని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

క్రిప్టో పన్నులకు తగ్గింపులు, సెట్ ఆఫ్‌లు లేవు: ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, మార్చి 21:క్రిప్టో పన్నులకు సంబంధించి ఎటువంటి తగ్గింపులు కానీ, సెట్ ఆఫ్‌లు కానీ అందుబాటులో లేవని ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ సమావేశంలో స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ కార్తీ పి చిదంబరం భారత్ లోని క్రిప్టోకరెన్సీల స్థితి, ప్రత్యేకించి దాని చట్టపరమైన హోదాపై వేసిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. క్రిప్టో కరెన్సీల మైనింగ్ సమయంలో జరిగే మౌలిక సదుపాయాల ఖర్చులను సముపార్జన ఖర్చుగా పరిగణించవచ్చా ? అన్న విషయమై కూడా కాంగ్రెస్ ఎంపీ స్పష్టత కోరారు. ఇక... వర్చువల్ డిజిటల్ ఆస్తులను బదిలీ చేయడం వల్ల కలిగే నష్టాన్ని ఇతర వర్చువల్ డిజిటల్ ఆస్తుల నుండి వచ్చే లాభాలతో భర్తీ చేయవచ్చా ? అన్న విషయమై కూడా చిదంబరం స్పష్టత కోరారు. వర్చువల్ డిజిటల్ ఆస్తుల బదిలీ వల్ల కలిగే నష్టాన్ని ఇతర ఆదాయాలకు వ్యతిరేకంగా సెట్ చేయలేమని పేర్కొనడం గమనార్హం. కాగా... చౌదరి ప్రతిస్పందిస్తూ...భారత్‌లో క్రిప్టోకరెన్సీలను నియంత్రించడంలేదని పేర్కొన్నారు. ఇక... క్రిప్టోకరెన్సీలపై పన్నుల విషయంలో ఎలాంటి తగ్గింపులు, లేదా... సెట్ ఆఫ్‌లకు అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. ఫైనాన్స్ బిల్లు 2022 ను పేర్కొంటూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. క్రిప్టోకరెన్సీలు, వర్చువల్ డిజిటల్ ఆస్తుల విషయానికొస్తే... భారత్ కొంత కఠినమైన వైఖరిని తీసుకుందని ఎత్తి పేర్కొనడం గమనార్హం. అంతేకాకుండా... రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా... క్రిప్టో ఆస్తుల విషయమై పలుమార్లు ఆందోళనలను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఠాక్రే సర్కార్‌లో పవార్ పార్టీకే ప్రయోజనం : శివసేన ఎంపీ

ముంబై, మార్చి 21: మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో కూడిన ఎంవీఏ సర్కార్‌పై సేన ఎంపీ గజానన్ కీర్తికార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కూటమి భాగస్వామ్య పక్షం ఎన్సీపీపై అసహనం వ్యక్తం చేశారు. రత్నగిరిలోని దపోలిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఠాక్రే సర్కార్‌గా పిలుస్తారు కానీ..వాస్తవంగా ప్రయోజనాలు మాత్రం పవార్ సర్కార్‌కు దక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ముంబైలో సీఎం, నగర్ వికాస్ నిధులతో తగినన్ని నిధులు లభ్యమవుతున్నా గ్రామీణ ప్రాంతాల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు పలు గ్రామాల బాగోగులను చూసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో తనకు చేతనైన సాయం తాను చేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు తీవ్ర పోటీ నెలకొందని అంటూ పేరుకు ఠాక్రే సర్కార్ అయినా వాస్తవంగా పవార్ సర్కార్‌కే మేలు జరుగుతోందని ఎన్సీపీ తీరును దుయ్యబట్టారు.

ఇక ఎంవీఏ సర్కార్‌లో తగినన్ని నిధులు మంజూరు కావడం లేదంటూ శివసేన, కాంగ్రెస్ మంత్రులు సైతం పలు సందర్భాల్లో ఫిర్యాదు చేశారు. ఇక శివసేన, కాంగ్రెస్ కంటే ఎన్సీపీనే ఠాక్రే సర్కార్‌లో ఎక్కువగా నిధులు రాబడుతోందని అసెంబ్లీలో విపక్ష నేత దేవేంద్ర ఫడ్నవీస్ సైతం గతంలో వ్యాఖ్యానించారు.

మెదక్ జిల్లాలో రూ.4 లక్షల విలువ చేసే అల్ఫాజోలం పట్టివేత

మెదక్, మార్చి 21:: కల్లులో మత్తు కోసం వినియోగించే రూ.4 లక్షల విలువైన అల్ఫాజోలంను ఆదివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఎక్సైజ్ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్‌లో కల్లులో కలుపడానికి వినియోగించే అల్ఫాజోలం ఉన్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేయగా రూ.4 లక్షల విలువ చేసే 1.150 కిలోల అల్ఫాజోలం పట్టుబడింది. నిందితులు దాస్‌గౌడ్, శ్రీనివా?సగౌడ్‌లను అరెస్టు చేసు కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. నిందితులను సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com